

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL

GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 163 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 12 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్

## పర్యాటక కేంద్రాలకు అనుగుణంగా

# రైల్వే లైన్లు



### శంషాబద్ అమరావతి మధ్య గ్రీన్ కారిడార్

-రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి
-కొత్త లైన్లకు అవసరమైన భూసేకరణకు సిద్ధం
-భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు
-రైల్వే అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు- భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు- ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచిం చారు. ప్రయాణికులకు వేగవం తమైన రవాణా సదుపాయాలు అందిం చటంతో పాటు- కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతో ముఖాభి వృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీ-ని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు-, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు.



## నేడు ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 11, సమయజ్యోతి:**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ ఘన విజయం సాధించారు. ఆయన ఉపరాష్ట్రపతి బాధ్యతలు చేపట్టేందుకు శుక్రవారం ముహూర్తం ఖరారు చేశారు. సెప్టెంబర్ 12వ తేదీన సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఆ క్రమంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రంగలోకి దింపారు. అలాగే ప్రతిపక్ష ఇండి కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఇక బిఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి.

## గ్రూప్-1 అవకతవకలపై

# నిగ్గు తేల్చాలి

### రేవంత్‌ను సర్కార్‌ను యువత క్షమించదు

### ట్వీట్ చేసిన కెటిఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణ మయిందని చెప్పారు. హైకోర్టు ఆదేశించినట్లు- పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అవకత వకలపై జ్యుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'సర్కారు కొలువుకోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్నీ, అమ్మా, నాన్నల కష్టార్జితాన్నీ ధారపోసిపోటీ- పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసింది ఈ కాంగ్రెస్ సర్కార్. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకల కు కారణమయ్యింది. అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతుకోసింది. గ్రూప్ 1 పరీక్ష నిర్వహణలో ఫెయిల్ అయిన ఈ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదు. హైకోర్టు ఆదేశించినట్టు- గ్రూప్-1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలి. అవకతవకలపై జుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేస్తున్నానంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.




## ఓట్ చోరీపై అణుబంబులాంటి ఆధారాలు

### పునరుద్ఘాటించిన కాంగ్రెస్ నేత రాహుల్

**లక్నో,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఓట్ చోరీ గురించి త్వరలో 'అణుబాంబు లాంటి ఆధారాలు' వెల్లడిస్తానని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బిజెపి ఓట్ చోరీకి పాల్పడుతుందని పునరుద్ఘాటించారు. ఓట్ చోరీకి సంబంధించి ఇప్పటికే కొన్ని సాక్ష్యాధారాలను వెల్లడించానని, భవిష్యత్తులో ' హైడ్రోజన్ బాంబ్ వంటి ఆధారాలు బయటపెడతానని అన్నారు.

## రెండు కీలక బిల్లులకు గవర్నర్ ఆమోదం

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 11, సమయజ్యోతి:**

రెండు కీలక బిల్లులను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఆమోదించారు. మొత్తం నాలుగు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే అందులో రెండు బిల్లులను ఆమోదించారు.




## బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుంది

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 11, సమయజ్యోతి:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం అడ్డుకుంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ లోని మంత్రి పొంగులేటి నివాసంలో కాంగ్రెస్ నేతలు సమావేశం అయ్యారు.







### రాజకీయంగా లక్ష్యం చేసుకునేందుకు సోషల్ మీడియాలో

# పెయిడ్ క్యాంపెయిన్

ఈ20 బ్లెండింగ్ పెట్రోల్‌కు వ్యతిరేకంగా తనను రాజకీయంగా లక్ష్యం చేసుకునేందుకు సోషల్ మీడియాలో పెయిడ్ క్యాంపెయిన్ నడుస్తుందని కేంద్ర రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆరోపించారు. ఆటోమొబైల్ తయారీదారుల సంఘం వార్షిక సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ20 బ్లెండింగ్ పెట్రోల్ విమర్శలపై నితిన్ గడ్కరీ ఎదురుదాడి చేశారు. పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్‌పై అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఆటోమొబైల్ తయారీదారులు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్‌పై తమ పరిశోధనలను పంచుకున్నాయని గడ్కరీ తెలిపారు.'మీ పరిశ్రమ పనిచేసే విధానం తరహాలోనే రాజకీయాలు కూడా పనిచేస్తాయి. సోషల్ మీడియా పెయిడ్ క్యాంపెయిన్ జరుగుతోంది. ఇది నన్ను రాజకీయంగా లక్ష్యంగా చేసుకునేందుకే. దాంట్లో ఎలాంటి వాస్తవం లేదు. ప్రతీది స్పష్టంగా ఉంది. ఇథనాల్ మిశ్రమం అనేది దిగుమతికి ప్రత్యామ్నాయం. కాలుష్య రహితమైంది. స్వదేశీ' అని గడ్కరీ తెలిపారు. భారత్ శిలాజ ఇంధనాల దిగుమతిపై భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తుందని గడ్కరీ తెలిపారు. శిలాజ ఇంధన దిగుమతులను తగ్గించడానికి, ఆదా చేసిన మొత్తాన్ని భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి పెట్టడానికి ప్రయత్నించడం మంచి చర్య కాదా? అని ఆయన ప్రశ్నించారు. 'మక్కజొన్న నుంచి ఇథనాల్‌ను తయారు చేస్తాం. ఈ చర్య రైతులకు రూ.45వేల కోట్ల ప్రయోజనం చేకూర్చింది' అని పేర్కొన్నారు.

## సోనియాగాంధీకి దిల్లీ కోర్టులో ఊరట ఓటర్ నమోదుపై దాఖలైన కేసు కొట్టివేత




**న్యూఢిల్లీ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి దిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది.

# టీచర్ విజయభాస్కర్ అకాల మరణం చాల బాధాకరం. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ టీచర్ కేజీ విజయభాస్కర్ రెడ్డి అకాల మరణం చాల బాధాకరమని రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మృతిని పార్థివ దేహానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య కవితను వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ఓదార్చారు. వీరి వెంట టీపీసీసీ అధ్యక్షుడు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్, మార్కెట్ చైర్మన్ ఎం.డి రహమతుల్లా, అమరచింత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు కొత్త గౌని మహేందర్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు ఎస్. శ్యాం కుమార్, పోసిరి గారి విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరాజు యాదవ్, ఏకే వెంకటేశ్వర్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

## ఓట్ చోరీపై అణుబంబులాంటి ఆధారాలు పునరుద్ఘాటించిన కాంగ్రెస్ నేత రాహుల్

తన నియోజకవర్గం రారుబరేలీలో రెండు రోజుల పర్యటన కోసం రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్ చేరుకున్న సంగతి తెలిసిందే. గురువారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ- (దిషా) సమావేశానికి అధ్యక్షత వహించారు. కలెక్టరేట్‌లోని బచత్ భవన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) గురించి మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటక మరియు హర్యానాలో ఎన్నికలు దోచుకోబడ్డాయి. అధికారికంగా మరియు వ్రాతపూర్వకంగా నమోదు చేయబడిన సాక్ష్యాలను సమర్పించానని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంచలన, ఎక్సిఎ÷-లోజివ్ ప్రూఫ్ వెల్లడించనున్నామని అన్నారు. ఓట్ చోర్, గడ్డిచోర్ అనే నినాదం దేశవ్యాప్తంగా వినిపిస్తోందని అన్నారు. రాష్ట్రాల్లో ఓట్లు- దొంగిలించబడి ప్రభుత్వాలు ఏర్పడు తున్నాయన్నది వాస్తవమని, వాటికి మీకు రుజువు ఇస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. హైడ్రోజన్ బాంబు పేలినపుడు, మొత్తం తుడిచిపెట్టు-కుపోతుందని, ఇప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బిజెపి నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు.

మొదటిపేజీ తరువాయి

## బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుంది

ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ విజయోత్సవ బహిరంగ సభ విజయవంతం కోసం జనసమీకరణ ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. 42శాతం బీసీ రిజర్వేషన్లతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. బహుజన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు: బీర్ల ఐలయ్య

గత కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. ఆలేరు నియోజకవర్గానికి 3700 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ప్రజా పాలనతో, బీర్ల ఫౌండేషన్ సహకారంతో పేదలకు ప్రోత్సాహం ఇస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పట్టుబట్టలు, పొట్టేలు బహుకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. గురువారం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మీడియాతో మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకు అతీతంగా ఇస్తున్నామని మాటిచ్చారు. 2007లో వర్టూర్ గ్రామంలో దళిత వాడల్లో మాజీ సీఎం కేసీఆర్ పల్లెనిద్ర చేశారని గుర్తుచేశారు. అప్పుడు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని పేదలకు కేసీఆర్ చెప్పారని కానీ తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ధ్వజమెత్తారు. పేదలను కేసీఆర్ నట్టేట ముంచారని మండిపడ్డారు. చట్టం తన పని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు ఉంటే అధికారంలోకి వచ్చిన వారంలోపే బిఆర్ఎస్ నేతల అరెస్టులు ఉండేవని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## రెండు కీలక బిల్లులకు గవర్నర్ ఆమోదం

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 11, సమయజ్యోతి:

రెండు కీలక బిల్లులను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం ఆమోదించారు. మొత్తం నాలుగు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే అందులో రెండు బిల్లులను ఆమోదించారు. అందులో జిన్నారం మున్సిపాలిటీలో గ్రామాల చేర్చే పంచాయతీ, మున్సిపల్ చట్ట సవరణకు ఆమోదం లభించగా, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ అసెంబ్లీ ఆమోదించిన చట్టం పెండింగ్‌లోనే పెట్టారు. దీంతో ఇంకా సందిగ్ధం వీడలేదు. ఆమోదించిన రెండు బిల్లులకు సంబంధించి అతి త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. కాగా, రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, పురపాలికలు, నగరపాలక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేసి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ బిల్లులు రెండింటిని సెప్టెంబర్ 2న రాజ్ భవన్ కు పంపిన విషయం తెలిసిందే. ఆగస్టు 31న అసెంబ్లీలో సెప్టెంబర్ 1న శాసన మండలిలో ఆ రెండు బిల్లులు ఆమోదం పొందిన సంగతి తెలిసిందే.




# పర్యాటక కేంద్రాలకు అనుగుణంగా రైల్వే లైన్లు



కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు- ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు- అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు- చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్‌తో పాటు- రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్లను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలో మీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతి పాదనలకు అనుగుణంగా హైదరా బాద్-చెన్నై, హైదరాబాద్-బెంగు ళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్య మంత్రి రైల్వే అధికారులకు సూచించారు హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్య మంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు- చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ- ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు- గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు- వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. శంషాబాద్ నుంచి చెన్నయ్ వరకు బుల్లెట్ ట్రైన్ కొత్త రైల్వే కనెక్టివిటీ- అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

మొదటిపేజీ తరువాయి

# సోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట ఓటర్ నమోదుపై దాఖలైన కేసు కొట్టివేత

న్యూఢిల్లీ,సెప్టెంబర్11(సమయజ్యోతి):

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు- సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌దారు వికాస్ త్రిపాఠి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది పవన్ నారంగ్ బుధవారం ఈ పిటిషన్‌పై వాదన వినిపించారు. ముందుగా పౌరసత్వ పరిమితిని పూర్తి చేయాలని, తర్వాత వారు ఆ ప్రాంత నివాసి అవుతారని పేర్కొన్నారు. 1980లో రేషన్ కార్డు లేదా పాస్‌పోర్ట్ నివాస పత్రంగా ఉండిఉంటుందని అన్నారు. ఆమె భారతీయ పౌరురాలైతే.. 1982లో ఆమె పేరును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అప్పుడు ఎన్నికల సంఘం రెండు పేర్లను తొలగించిందని, ఒకటి విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సంజరుగాంధీది, మరొకటి సోనియాగాంధీదని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం తప్పును గుర్తించిందని, ఓటర్ల జాబితా నుండి ఆమె పేరును తొలగించాలని ప్రయత్నించిందని నారంగ్ అన్నారు. 1980 సెప్టెంబర్ 4న న్యూఢిల్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో ఆమె చేర్చారని, అనంతరం 1982లో తొలగించారని అన్నారు. భారత పౌరసత్వం పొందిన తర్వాత 1983లో తిరిగి నమోదు చేయబడిందని అన్నారు. 1983లో సోనియాగాంధీ భారత పౌరసత్వం పొందారనే ఆరోపణపై దర్యాప్తు కోసం పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఎన్ఎస్ సెక్షన్ 175(4) కింద ఈపిటిషన్ దాఖలు చేయబడింది.

# నేపాల్ ఆందోళనలతో ఖైదీల పరార్ పారిపోతున్న ఖైదీలపై ఆర్మీ కాల్పులు

ఖాట్మండ్,సెప్టెంబర్11(సమయజ్యోతి):

నేపాల్ లో జెన్-జెడ్ ఉద్యమకారులు చేపట్టిన ఆందోళనలను ఆసరాగా తీసుకొని జైళ్ల నుంచి ఖైదీలు పరారవుతున్న క్రమంలో రామెచాప్ జైలు నుంచి పారిపోతున్న కొందరు ఖైదీలపై ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయి. దీంతో దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం జైలు గేటు- తాళాలను విరగ్గొట్టి ఖైదీలు పారిపోయేందుకు ప్రయత్నించారని చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ శ్యామ్‌కృష్ణ థామా పేర్కొన్నారు. వారిని అడ్డగించేందుకు ఆర్మీ బలగాలు కాల్పులు జరిపాయని అన్నారు. ఈ కాల్పుల్లో డజను మందికి పైగా ఖైదీలు గాయపడ్డారని వెల్లడించారు. వారికి వైద్యచికిత్స అందిస్తున్నట్లు- వివరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. అయితే, కాఠ్‌మాండూ, పోఖరా, లలిత్‌పుర్‌లోని జైళ్ల నుంచి ఇప్పటికే వందలాది మంది ఖైదీలు తప్పించుకున్నట్లు- స్థానిక మీడియా పేర్కొంది. మొత్తం 7,000 మంది ఖైదీలు పరారైనట్లు- తెలుస్తోంది. ఇక, జైలు నుంచి పారిపోయి వస్తున్న నేపాలీ ఖైదీలను భారత సాయుధ పోలీసుదళం సశస్త్ర సీమా బల్ పట్టుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ సమీపంలో 22 మంది నేపాలీ ఖైదీలను అడ్డుకున్నట్లు- ఎస్ఎస్‌బీ అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఆందోళనల నేపథ్యంలో సరిహద్దుల్లో ఎస్ఎస్‌బీనే భద్రతను పర్యవేక్షిస్తుంది. దేశంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు-కు సన్నాహాలు జరుగుతున్నాయని కాఠ్‌మాండూ మేయర్ బాలెన్ షా విజ్ఞప్తి చేశారు. గురువారం నిరసనకారులను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సామాజిక మాధ్యమాలపై నిషేధంతో ప్రారంభమైన జెన్-జెడ్ ఉద్యమం.. అవినీతి వ్యతిరేక ఉద్యమంగా మారి హింసాత్మక ఘటనలకు దారితీసింది. కాఠ్‌మాండూతో సహా పలు నగరాల్లో పెద్దఎత్తున ఘర్షణలు జరగడంతో ఆర్మీ కర్ఫ్యూ విధించింది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 25 మంది ప్రాణాలు కోల్పోగా.. 600 మందికి పైగా గాయపడ్డారు.

# చార్లీ కిర్క్‌కు 'అమెరికా అత్యున్నత పౌర పురస్కారం'.. వెల్లడించిన ట్రంప్..!

అమెరికాలో సంచలనం సృష్టించిన తన సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్యపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. తమ దేశ యువత మనసును చార్లీ కంటే గొప్పగా మరెవరూ అర్థం చేసుకోలేరని పేర్కొన్న ట్రంప్ .. కిర్క్‌కు అమెరికా అత్యున్నత పురస్కారం ఇస్తున్నట్టు ప్రకటించారు. మరణాంతరం కిర్క్‌కు 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' గౌరవం కల్పిస్తున్నట్టు గురువారం ప్రెసిడెంట్ వెల్లడించారు. అమెరికా సమాజం కోసం, దేశ ప్రయోజనాల కోసం కృషి చేసిన పౌరులకు ఇచ్చే అత్యున్నత పురస్కారమే ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్.'తన తరంవాళ్లలో చార్లీ ఒక యోధుడు. స్వేచ్ఛ కోసం పోరాడిన ఛాంపియన్. అమెరికాలోని లక్షలాది మందికి అతడు స్ఫూర్తి. అతడిని మనం ఎంతగానో మిస్ అవుతాం. చార్లీ మరణించినప్పటికీ అతడి మాటలు.. అతడిచ్చిన ధైర్యం కోట్లాదిమంది గుండెల్లో, ముఖ్యంగా యువత హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.



## ఆర్థిక ఇబ్బందులు మానసిక ఒత్తిడితో గుండెపోటు గుర్రై, ఉపాధి హామీ టిఏ మృతి



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ధనుంజయ్ గురువారము విధులు నిర్వహిస్తున్న క్రమంలోనే బస్సాపూర్ గ్రామం సందర్శించుకుని వస్తుండగా మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతతో గుండెపోటుకు గుర్రై మృతి చెందారు. మృతునికి భార్య, మూడు సంవత్సరాల ఒక పాప ఉన్నారు. నెలల తరబడి జీతాలు సమయానికి రాక, బయట ఆర్థిక సమస్యలను తట్టుకోలేక, ఈఎంఐలు కట్టలేక, మానసిక ఒత్తిడితో గుండెపోటుకు గురైనట్లుగా గ్రామస్తులు భావిస్తున్నారు.

## ప్రధాని నరేంద్రమోడీ,ఎంపి చిత్ర పటాలకు క్షీరాభిషేకం

### కృష్ణ రైల్వే స్టేషన్ లో మూడు రైళ్ల స్టాప్ ప్రారంభం...

### మిఠాయిలు పంచుతున్న నాయకులు....

సమయజ్యోతి న్యూస్ కృష్ణ....

నారాయణ పేట జిల్లా

కరోనా కాలం 2019 నుంచి కృష్ణ రైల్వే స్టేషన్ లో 11014 కోయంబత్తూర్-లోకమాన్య తిలక్ రైలు,22159 ముంబై-చెన్నై రైలు,22160 చెన్నై-ముంబై రైళ్ళ స్టాప్ లను రైల్వే అధికారులు రద్దు చేశారు.రద్దు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఆయా రూట్లలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రైళ్ళ స్టాప్ లను పునరుద్ధతించాలని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమర్ కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు అనేక ఆందోళన కార్యక్రమాలు కేంద్ర మంత్రులకు,అధికారులకు వినతులు సమర్పించారు. అయినా ఫలితం లేకపోయింది.పాలమూరు ఎంపి గా డి కే.అరుణ గెలుపొందాక బిజెపి నాయకులు వినతి పత్రాలు సమర్పించారు.స్పందించిన ఎంపి.డి కే అరుణ రైల్వే మంత్రి,అధికారుల దృష్టికి తీసుకెళ్లి రద్దు అయిన రైళ్ల స్టాప్ లను పునరుద్ధరింప చేయడానికి కృషి చేశారు. దాంతో గురువారం కృష్ణ రైల్వే స్టేషన్ లో బిజెపి ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లె నరసప్ప ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ,ఎంపి.డికె.అరుణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జెనరల్ మేనేజర్ గారికి ధన్యవాద తీర్మానం కాపీ స్టేషన్ మాస్టర్ కు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అమరకుమార్ దీక్షిత్, బిజెపి ఉమ్మడి మండలాల అధ్యక్షుడు నల్లే నరసప్ప,జిల్లా నాయకులు బలరాం రెడ్డి,మాజీ అధ్యక్షులు జయనంద్ రెడ్డి, మాజీ నియోజకవర్గం కన్వీనర్ కర్నే స్వామి మాజీ వైస్ ఎంపీపీ ఆర్ వెంకటేష్, జిల్లా నాయకులు వాకిటి మల్లేష్, ప్రధాన కార్యదర్శులు డి



రాఘవేంద్ర, కే తిమ్మప్ప,మక్తల్ అధ్యక్షులు ప్రతాపరెడ్డ్, మాజీ ఎంపీటీసీ కొంకల్ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహాదేవప్ప, బిఆర్ఎస్ నాయకులు బర్మాన్పోళ్ల సురేష్, శంకర్ నాయక్,మలరెడ్డి గౌడ, డీకే కిష్టప్ప, బి శంక్రప్ప, లక్ష్మి సింగ్, లోకపల్లి హన్మంతు,శంకరయ్య శెట్టి, మండల్ నాయకులు గంప వెంకటప్ప,కుసుమర్తి మర్రెప్ప ఆంజప్ప గౌడ్, తిమ్మప్ప,వర్కూర్ ఉషానోళ్ల వెంకటప్ప, శ్రీను, కేశవరెడ్డి, ఐనపూర్ బస్వరాజ్, మంజునాథ్ స్వామి, నర్సింహా,ఉమ్మడి మండలం అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఎఫ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

## : ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమాన్య సంఘం

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో,

సెప్టెంబర్ 11.



గత నాలుగు సంవత్సరాలుగా మా ప్రవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు రావాల్సిన ఆర్ టి ఎఫ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమాన్య సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం నిర్మల్ పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేము స్థాపించిన కళాశాలలో ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా కేవలం ప్రభుత్వమే ఇస్తున్నటువంటి ఆర్టిఎఫ్ ఆధారంగా విద్యార్థులు కళాశాలలో చదువుతున్నా రన్నారు. అలాంటిది గత నాలుగు సంవత్సరాలుగా స్కాలర్షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఏర్పడుతుందని వివరించారు. ఇప్పటికైనా ఫీజు బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇందులో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యజమాన్య సంఘ సభ్యులు సాయిలు, సిహెచ్. వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు , అఖిలేష్ సింగ్, సతీష్ రెడ్డి, శ్రీధర్, నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

## నూతన తాసిల్దార్ కు సన్మానం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ తహశీల్ కార్యాలయంలో తాసిల్దార్ బోయిని రామచందర్ ను గురువారము ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్ల విటల్, సంఘ నాయకులు రవి, నాయకులు కలిసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఆలయ చైర్మన్ శరయ్యకు సన్మానం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణ శివకేశవ ఆలయాల చైర్మన్ గా ఎంపికైన మిడిదొడ్డి శరయ్యను గురువారము టీఎస్ పీఎస్సీ మాజీ సభ్యులు డాక్టర్ ఎర్రవల్లి చంద్రశేఖర్ రావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సురేందర్ రావు, అధ్యక్షులు నర్సింహారెడ్డి, బద్దిపడగే నందు లతో కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.



## అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు : కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్




అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం కలెక్టర్ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేయూత పెన్షన్ల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి.పి.టి. ద్వారా డైరెక్టర్ సెర్ప్ గోపాల్ అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ చేయూత పథకం కింద వృద్ధులకు, దివ్యాంగులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, వితంతువులకు, నేతన్నలకు, గీత కార్మికులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, బీడి టేకేదార్లు, డయాలసిస్, ఫైలేరియా పెషెంట్లకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని అన్నారు. ప్రస్తుతం వృద్ధుల పింఛన్ తీసుకుంటున్న వారు మరణిస్తే వారి స్థానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేయడం, హెచ్.ఐ.వి, డయాలసిస్ పింఛన్ పోర్టల్ ఓపెన్ ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ సంబంధించి రెండు రిజిస్టర్లు మెయింటెన్ చేయాలని ఒక రిజిస్టర్ లో మంజూరు చేసిన ఫించన్ దారుల వివరాలు, మరో రిజిస్టర్ లో అర్హత ఉన్న లబ్ధిదారుల వివరాలు రాయాలని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. వృద్ధాప్య పెన్షన్ దారులు మరణిస్తే వెంటనే పెన్షన్ వారి జీవిత భాగస్వామి కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ జారీ వివరాల రిజిస్టర్ పక్కాగా మెయింటైన్ చేయాలని అన్నారు. ఘబర్త్, డెత్ సర్టిఫికెట్ 6 నెలల లోపు మాత్రమే స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు జారీ చేయాలని, 6 నెలల తర్వాత రెవెన్యూ డివిజన్ అధికారికి మాత్రమే ఆ హక్కు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.చేయూత పింఛన్ దారులు మరణిస్తే వెంటనే చనిపోయినట్లు మార్కింగ్ చేయాలని, పెన్షన్ తీసుకుంటున్న వారు శాశ్వతంగా వలస పోతే క్షుణ్ణంగా విచారించిన తర్వాత పెన్షన్ తీసి వేయాలని అన్నారు. ప్రజా భవన్ దగ్గర జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను వెంటనే ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు 3 నుంచి 4 రోజులలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అర్హులైన పేదలకు అందాలని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల నిరుపేద కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినట్లయితే ఒకేసారి 20 వేల రూపాయల సహాయం అందుతుందని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఆపద్బంధు, జె.బి.వై., ఏఏబివై పథకం లబ్ధిదారులకు ఈ స్కిమ్ వర్తించదని, ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తులను తహసిల్దార్ క్షుణ్ణంగా విచారించి ఆర్డిఓ లకు రిపోర్ట్ అందించాలని, డిఆర్ఓ ద్వారా సెర్ఫ్ కు దరఖాస్తులు పంపడం జరుగుతుందని, ఆధార్ కార్డు, డెత్ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్ పుస్తకం రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం మొదలగు పత్రాలతో వీటిని పరిశీలించాలని అన్నారు. జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు, నేతన్న కుటుంబాలలో ఈ పథకానికి ఎవరైనా అర్హులు ఉంటారు లేదు పరిశీలించి ప్రతిపాదన సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ సెర్ప్ గోపాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శుల, వార్డ్ ఆఫీసర్లు పోస్టల్ సిబ్బంది సెక్షన్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికైన పిడి నామ్దేవ్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

తలమడుగు మండలం సుంకిడి ఉన్నత పాఠశాలలో పిడి వ్యాయామ బి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న జి. నాందేవ్ సెప్టెంబర్ 9 మరియు 10వ తేదీల్లో జరిగిన 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనారు. హైదరాబాదులోని జింఖానా గ్రౌండ్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యోగులు పాల్గొనగా పిడి నాందేవ్ ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జై వర్ధన్ రెడ్డి ఉపాధ్యాయులు టి. శ్రీనివాస్ స్వామి, బి .గజానంద్, వై.రామ్ రెడ్డి, పి .సుకుమార్, జి. సుజాత ,సి. శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిడి నాందే మాట్లాడుతూ ఆటల వల్ల ఆరోగ్యం మానసిక ప్రశాంతత సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అందుకే విద్యార్థిని విద్యార్థులు ఆటల పై మక్కువ చూయించి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని అన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# ఎదురుదాడి రాజకీయాల్లో ఆరితేరిన ఘనులు !

రెండు తెలుగు రాష్ట్రాల్లో విపక్ష రాజకీయ పార్టీల విన్యాసాలు చూస్తుంటే అసహ్యం కలగక మానదు. తప్పులెన్నువారు తమ తప్పులు ఎరగరనే సామెత వీరికి సరిపోతుంది. ఐదేళ్ల పాటు జగన్, పదేళ్ల పాటుకెసిఆర్ కుఉంబం దోచుకుంది. నిజానికి విభజన వీరిద్దరి కోసమే జరిగిందా అన్నట్లుగా పరిస్థితి వచ్చింది. ఈ రెండు కుటుంబాలు, వీరిని నమ్ముకున్ కొందిరు బాగు పడ్డారు.కానీ రెండు రెండు రాష్ట్రాలు దివాళా తీసాయి. వీరు గతంలో ఎలా పాలించారో ఇప్పటికే ప్రజలకు అర్థం అయ్యింది. అప్పులు చేసి, రాజభోగం అనుభవించి, రాష్ట్రాలను దివాళా తీయించారు. భూములను ఆక్రమించి, వరదలకు కారణమయ్యారు. బలవంతంగా భూములను లాక్కు న్నారు. ఒక్కో పథకంలో కోట్ల రూపాయలను దోచుకున్నారు. వీటిపై చర్యలు లేవు. నిలదీసే వారు లేరు. మళ్లీ అధికారం తమదే అని ఎదురుచూస్తు న్నారు. ఓ మూడేళ్లు ఓపిక పడితే మళ్లీ మనదే సామ్రాజ్యం అన్న ధీమాలో ఉన్నారు. అప్పటి వరకు తమ అవినతి బయటపడకుండా ఇప్పుడున్న ప్రభుత్వాలపై ఎదురుదాడి చేసి, ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇలా చెప్పు కుంటూ పోతే ఒక్కటేమిటి..అనేక అవలక్షణాలు కనిపిస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్ పాలనలు ఒకే తరహాలు నియంతల్లాగా సాగాయి. ప్రజలను పురుగుల్లాగా చూశారు. ప్యాలెస్‌లు వీడి ప్రజల్లోకి రాలేదు. ఇప్పటికీ ప్యాలెస్‌లు వీడి ప్రజల్లోకి రావడం లేదు. మరో మూడేళ్లు ఆగితే ..ప్రజలే మళ్లీ దిక్కులేక ఓట్లేస్తారన్న ధీమాలో ఉన్నారు. అందుకు ఇప్పుడున్న ప్రభుత్వాలపై బురదజల్లే పని ఉధృతంగా సాగించాలన్న ధోరణిని కొనసాగిస్తున్నారు. అందుకే ఇప్పుడు బురద రాజకీయాల్లో అటు వైకాపా, ఇక్కడ బిఆర్‌ఎస్ ఆరితేరింది. బురదలో ప్రజలను ఆదు కోవాలన్న సోయి లేకుండా చేస్తున్న విమర్శలు సిగ్గుచేటు కాక మరోటి కాదు. తమకు తప్ప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగే అర్హత మరెవరికీ లేదన్న భావనలో అటు జగన్, ఇటు కెసిఆర్ ఉన్నారు. తామే మంచి పాలకులమని, ఇప్పుడున్న ప్రభుత్వాలదే బాధ్యతని గగ్గోలు పెడుతున్నారు. ప్రజలంతా ఇప్పుడు మళ్లీ కెసీఆర్ రావాలని, జగన్ కావాలని గగ్గోలు పెడుతున్నారని బాకా పత్రికల్లో రాసు కుంటున్నారు. ఇలా వారికి వారే నమ్ముతున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు అధి కారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతున్నట్టుగానూ, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నట్లు గానూ ప్రచారం చేసుకున్నారు. బాకా పత్రికలు ఆహో ఓహో అన్నట్లు రాస్తూ వచ్చాయి. అలాంటి రాష్ట్రాల్లో ఇప్పుడు అంతా అధ్వాన్నంగా అయినట్టుగా కనిపిస్తోందని కూడా ప్రచారం చేసుకుంటున్నారు. వారి మీడియా ప్రచారం చేసే కథనాలను అనుచరగణం ప్రచారం లో ముందుకు తీసుకుని పోతోంది. సోషల్ మీడియాలో హద్దూ పద్దూ లేకుండా విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయాలు ఇవే. తెలంగాణలో ఇద్దరు కెసిఆర్ కుటుంబ సభ్యులు రోజూ డజన్ల కొద్దీ ఆరోపణలు చేస్తున్నారు. ఏదైనా మంచి జరిగిందని చెప్పరు. హైడ్రా మంచిని చెప్పరు. మూసీ ప్రక్షాళన తప్పంటారు. ఎరువులు కేంద్రం పంపకుండా ఉంటే అదీ ఇక్కడి ప్రభుత్వాల తప్పంటారు. ఇలాంటి సుద్దపూసలు ప్రజల గురించి కన్నీరు కారుస్తున్నారు. ఇక ఎపిలో కూడా సిఎం చంద్రబాబుకు పనీపాటా లేదన్నట్టుగా ప్రజల్లో తిరుగుతున్నాడని జగన్ భావిస్తున్నారు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతున్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులు కూడా అలాగే అంటున్నారు. కెసిఆర్ తరఫున కెటిఆర్, హరీష్ రోజూ గొంతు చించుకుంటున్నారు. జగన్‌కు మాత్రం ఆయనే గొంతు చించు కోవాల్సి వస్తోంది. అడపాదడపా ఆయన అనుంగు సహ చరులు సజ్జల, అంబటి, పేర్ని నాని వంటి వారు గళమెత్తున్నారు. గత తమ పాలనలో జరిగిన అక్రమాలు ప్రజలకు కొనే తెలుసు. ఎన్ని జరిగాయో ఎలా దోచుకున్నారో వారికే బాగా తెలుసు. ఈ నేపథ్యంలో అత్మపరిశీలన చేసుకోవాల్సిన వైకాపా, బిఆర్‌ఎస్ నేతలు ఆత్మవంచన చేసుకుంటున్నారు. వరదలొస్తే రాజధాని అమరావతి మునిగి పోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే బాగుండన్న భావనలో ఉన్నారు. నిత్యం తాము చెప్పే అబద్దాలను కొందరైనా నమ్మకపోతారా అన్నది ఈ రెండు పార్టీల నేతల భావనగా ఉంది. అందుకే రెండు రాష్ట్రాల్లో ఒకే తరహా ప్రచారం సాగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు కూడా వీరి పాలన ఒకే తరహాలో అంటే నిరంకుశం గా సాగింది. తాము దివి నుంచి దిగివచ్చిన నేతలుగా ప్రచారం చేసుకున్న తెలుగు వల్లభులు ఇప్పుడు అదే కోమాలో ఉంటున్నారు. గతంలో అలా నమ్మడం వల్లనే ప్రజలు ఆ ఇద్దరు నేతలకు అధికారం కట్టబెట్టారు. అందుకే ఇప్పుడు కూడా అబద్దాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మించవచ్చని చూస్తున్నారు. అందుకే అబద్దాలకు పదును పెడుతున్నారు. రోజూ అబద్దాల ప్రచారం లో పోటీ పడుతున్నారు. తెలంగాణలో అయితే గత పాపాలపై ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పడం లేదు. కాళేశ్వరంపై సమాధానం లేదు. ఈ కార్ రేసింగ్ పైనా నోరెత్తరు. లొట్టపీసు కేసంటారు. రేవంత్ పాలన అధ్వాన్నమని ప్రచారం చేస్తే కొందరైనా నమ్ముతారని, తమ పార్టీ వారు నమ్మి జారుకోకుండా ఉంటారని బిఆర్‌ఎస్ నేతల ఆరాటం. అందుకే ఈ బరితెగింపు రాజకీయాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్, చెరువుల ఆక్రమణలు, బలవంతంగా భూములు లాక్కోవడం, అప్పులు చేయడం వంటి వాటిపై బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడడం లేదు. పార్టీ ఫిరాయింపుల పైనా సుద్దులు మాట్లాడుతున్నారు. తెలంగాణకు తామే పేటెంట్ అన్నట్లుగా వారిద్దరి వ్యవహార శైలి ఉంది. ప్రజలు మంచీచెడు తెలుసుకోవాలి. కాంగ్రెస్ చేస్తున్న తప్పులను కూడా సమర్థించరాదు. వారు తప్పుచేస్తే నిలదీయాలి. చంద్రబాబు తప్పు చేసినా నిలదీయాలి.



# నేడు సునీల్ రెడ్డి.. నియోజకవర్గం పర్యటన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

ఈనెల 12న బాల్కొండ నియోజకవర్గంలో సునీల్ కుమార్ రెడ్డి పర్యటించనున్నారు. వెంచిర్యాల్ బుసాపూర్, పోచంపాడు గ్రామాల్లో పర్యటిస్తారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు షెడ్యూల్ ఫాలో కాగలరు

# బిసి రిజర్వేషన్ పైన తలతిక్క మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ నాయకులు

## డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

బిసి రిజర్వేషన్ పైన తలతిక్క మాటలతో బిజెపి ఆయన ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారము నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చినా తర్వాతనే సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం ద్వారా కేంద్రం నుంచి వచ్చే నిధులు రాక ఇబ్బంది పడుతున్నప్పటికీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, అసెంబ్లీ లోపల బిజెపి ఎమ్మెల్యేలు బీసీ బిల్లుకు ఆమోదిస్తున్నామని చెప్తూనే అసెంబ్లీ బయట బిజెపి ఎంపీలు బీసీ బిల్లు నుండి మైనారిటీలను తీసేస్తేనే బిల్లుకు ఆమోదం తెలుపుతామని చెప్పడం అనేది బిజెపి ద్వంద నీతికి నిదర్శనమని అన్నారు. బీసీ బిల్లులో ఎక్కడ కూడా మైనారిటీలకు రిజర్వేషన్ ఇస్తామని తెలుపలేదని బీసీ లోకి వచ్చే అన్ని వర్గాలకు బిల్లు అమలవుతుందని మాత్రమే తెలపడం జరిగిందని, కానీ ఆ మాత్రం కూడా తెలవకుండా మైనారిటీలకు బీసీ బిల్లు నుండి తొలగిస్తే బీసీ బిల్లుకు ఆమోదం తెలుపుతామని బండి సంజయ్, కిషన్ రెడ్డి చెప్పడం చూస్తుంటే వారి అవివేకం బయటపడుతుందని, కేవలం మోడీ మెప్పు కొరకు మాత్రమే రాష్ట్రంలో బీసీ బిడ్డలకు బండి సంజయ్, కిషన్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని, కిషన్ రెడ్డి అగ్రకులానికి చెందిన వాడు కాబట్టి బీసీలకు రిజర్వేషన్ రావద్దని చెప్తున్నాడని, కానీ బీసీ బిడ్డ అయిన బండి సంజయ్ బీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి ఎందుకు అడ్డుపడుతున్నాడో చెప్పాలని, అడ్డుపడటమే కాకుండా ఒక పిచ్చోడి మాదిరిగా మైనారిటీలను బీసీ బిల్లు నుండి తొలగిస్తేనే ఆమోదం తెలుపుతామని చెప్పడం విడ్డూరంగా ఉందని, బిసి బిల్లులు ఎక్కడ కూడా మైనారిటీలకు రిజర్వేషన్ ఇస్తామని ప్రత్యేకంగా తెలుపలేదని మానాల మోహన్ రెడ్డి వివరించారు. దేశంలో అందరికీ సామాన న్యాయం జరగాలని ఆలోచించే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి అధ్యక్షతన కులగణన జరిపి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందిని, నిజంగా బిజెపి నాయకులు బీసీ బిల్లును మద్దతు తెలుపుతూ ఎక్కడికక్కడ బిజెపి ఎంపీలు విలేకరుల సమావేశాలు నిర్వహించి బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని మానాల మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన కామారెడ్డిలో చరిత్రలో నిలిచిపోయే విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పైన బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, అందులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని, జిల్లాలో ఉన్న బీసీ సోదరులందరూ ఎక్కడికక్కడ సమావేశాలు నిర్వహించుకుని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించుకునే విధంగా ఈ నెల 15వ తేదీన నిర్వహించే సభను విజయవంతం చేయాలని, కచ్చితంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి తీరుతామని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు యాదగిరి, భీమ్గల్ మండల అధ్యక్షులు బోదిరే స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, లవంగ ప్రమోద్, ఈసా, అబ్దుల్ ఎజాజ్, సుభాష్ జాదవ్, సంగెం సాయిలు, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు

## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 11 :**



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం సిరన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. లబ్ధిదారులను కలిసి, ఇంటి నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో 93 మందికి ఇళ్లు మంజూరు కాగా, 69 గ్రౌండింగ్ అయ్యాయని, 12 ఇండ్లు స్లాబ్ దశలో ఉన్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మిగతా 24 మంది కూడా ఇళ్లను నిర్మించుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఇంటి నిర్మాణ దశలను అనుసరిస్తూ లబ్ధిదారులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే, అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బిల్లుల చెల్లింపులలో జాప్యం జరుగకూడదని అన్నారు. లబ్ధిదారులకు సెర్ప్ ద్వారా రుణాలు మంజూరు అయ్యేలా చొరవ చూపాలని హితవు పలికారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేవలం రవాణా, కూలీల వేతనాలను మాత్రమే లబ్ధిదారులు చెల్లిస్తే, ఇసుక ఉచితంగా సమకూర్చడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ నవీపేట ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. కొత్తగా మంజూరీలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా తోడ్పాటు అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష జరిపారు. సాదా బైనామా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్ర స్థాయి విచారణ నిర్వహిస్తూ, త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఎంపీడీఓ నాగనాథ్, సిరన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయిలు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు ఏ.ఐ. టూల్స్ పై శిక్షణ ఇవ్వాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

విద్యార్థులకు ప్రస్తుత ఆధునిక ఏఐ టూల్స్ పై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూము, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజు అందిస్తున్న భోజన, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు చుట్టూ అపరిశుభ్రత, రహదారి, విద్యాలయం భవనానికి ప్రహరీ లేనట్లు గమనించారు. విద్యాలయం ఆవరణను శుభ్రంగా చేయాలని వేములవాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డు, ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

**పాఠాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని..**



పాఠశాలలోని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, సోషల్, సైన్స్ ఎకనామిక్స్ కంప్యూటర్స్ పాఠాలను బోధించారు. ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్స్ ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థులను ఉదయం బ్రేక్ ఫాస్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వచ్చే ముందు పాఠాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని వచ్చి విద్యార్థులకు సరిగ్గా విద్యాబోధన చేయాలని ఆదేశించారు.

# నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం పని తీరుపై సమీక్ష

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 11 :**

నిజామాబాద్ నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం పని తీరుపై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష జరిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలెక్టర్ సమావేశమై నూతన భవన నిర్మాణాలకు అనుమతులు, క్రబద్దీకరణ, అక్రమ కట్టడాలపై చేపట్టిన చర్యలు తదితర వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఫైళ్లను తనిఖీ చేసి, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్ రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్దీకరణ ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



# పేకాట జూదం హానికరం..

## వారిపై కఠిన చర్యలు : ఎస్సై శైలేందర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

పేకాట, జూదం ఆడటము సమాజానికి హానికరం, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం బాల్కొండ ఎస్సై శైలేందర్ హెచ్చరించారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఈ విధమైన చట్టవిరుద్ధ పనులను గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. చిట్టాపూర్ లో ఎనిమిది మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లుగా, వారి వద్ద నగదు 4500, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# సౌదీ బ్యాంకులో గల్ఫ్ కార్మికుడి కష్టార్జితం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

'సౌదీ నేషనల్ బ్యాంక్' లోని తన ఖాతాలో ఉన్న సొమ్మును ఇండియాలోని తన బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించాలని లేదా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ద్వారా అందించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము తెర్లుమద్ది వాసి, గల్ఫ్ ప్రవాసీ రాగం రాజమల్లు, హైదరాబాద్, బేగంపేట ప్రజాభవన్ లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో గత మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జెఏసి నాయకుడు తోట ధర్మేందర్ లు అతనికి అండగా నిలిచారు. సౌదీ అరేబియా దేశం అభా పట్టణ సమీపంలోని అల్-హరాజా మున్సిపాలిటీలో 2014 నుంచి 2025 వరకు 10 సంవత్సరాల పాటు క్లీనర్ గా పనిచేశాడు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు 21,500 సౌదీ రియాళ్ళు సుమారు రూ.5 లక్షల సొమ్మును యాజమాన్యం సౌదీ లోని అతని బ్యాంకు ఖాతాలో జమ చేసింది. డబ్బును అకౌంట్ నుంచి తీసుకునే లోగానే అతన్ని ఫిబ్రవరి 12న ఇండియాకు పంపించడంతో, అ డబ్బును సౌదీ బ్యాంక్ నుంచి భారత్ కు బదిలీ చేయించడానికి, తమ కంపెనీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, పాకిస్థాన్ జాతీయుడైన మహమ్మద్ బిలాల్ కు 'పవర్ ఆఫ్ అటార్నీ' ఇచ్చానని రాజమల్లు తెలిపారు. తన సమస్యను జిద్దా లోని భారత దౌత్య కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాజమల్లు కోరారు.




# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రుణ సహకారం: డిఆర్డిఏ పీడి సాయి గౌడ్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

ఇందిరమ్మ ఇండ్ల గృహా లబ్ధిదారులకు లక్ష నుంచి రెండు లక్షల వరకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, మహిళా సమాఖ్య వివో భవనాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు సహకరించాలని డిఆర్డిఏ పిడి సాయి గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా పరిషత్ సమావేశం హాల్లో గురువారము ఇందూరు జిల్లా మహిళా సహకార సమాఖ్య అధ్యక్షురాలు హేమలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన వార్షిక, మాస సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 14,000 మందికి ఇందిరమ్మ గృహాల మంజూరు జరిగిందని అందులో 4300 ఇండ్ల గ్రౌండింగ్ జరిగిందని అన్నారు. మహిళా సమైక్య నుంచి ఆర్టీసీకి బస్సు అద్దెకు ఇవ్వడం వల్ల సమైక్యకు నెలకు 68 వేలు చెల్లిస్తారని, పాఠశాల విద్యార్థుల యూనిఫారం దుస్తులు కుట్టి, పాఠశాలల్లో అప్పగించడం వల్ల మహిళా సభ్యులకు ఉపాధి అందుతుందని, గొర్లు మేకలు, పెరటి కోళ్ల పెంపకానికి, ఎలక్ట్రిక్ బైకులు, మొబైల్ ఫిష్ వ్యాపారాల నిర్వహణకు శ్రీనిధి రుణాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి మమత, కోశాధికారి సూర్య జ్యోతి, డిపిఎంలు మధుసూదన్, నీలిమ, కిరణ్ కుమార్ సంధ్యారాణి, మోహన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



# పాలమూరు ప్రజలకు యశ్వంత్పూర్ రైల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించిన ఎం. పి. డి. కె అరుణమ్మ.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

మహబూబూబ్ గర్ పార్లమెంటు సభ్యురాలు బిజెపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డి. కె. అరుణమ్మ పాలమూరు ప్రజలకు మరిన్ని రైలు సౌకర్యాలను కల్పించారు. మహబూబ్ నగర్ స్టేషన్ లో ఆగే రైళ్లు 1. బెంగళూరుయశ్వంతపూర్- జబల్పూర్ వీక్లీ. 2. జబల్పూర్ -బెంగళూరు వీక్లీ జడ్చర్లలో ఆగే రైళ్లు 3.జైపూర్- మైసూర్ 4.కృష్ణా రైల్వే స్టేషన్ లో నిలిపే రైళ్లు కోయంబత్తూర్- లోకమాన్య తిలక్ ప్రతిరోజు 5.ముంబై- చెన్నై ప్రతిరోజు 6.చెన్నై- ముంబై వీక్లీ రైలు నడిపిస్తారు. ఎంపీ డి. కె. అరుణమ్మ తన పార్లమెంట్ పరిధి తో పాటు ఉమ్మడి పాలమూరు ప్రజల అవసరలను దృష్టిలో పెట్టుకొని రైల్వే సేవలు ప్రజలకు మరింత దగ్గరవ్వాలని రైల్వే ఉన్నత అధికారులకు కోరడంతో ఎం. పి. చేసిన ప్రతి ప్రాధనాలకు వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదివరకు యశ్వంత్పూర్ రైలు మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్ లో నిలిపేవారు కాదు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు యశ్వంత్పూర్ రైలు లో ప్రయాణించాలంటే హైదరాబాదు నుండి ప్రయాణించే పరిస్థితి దాపరిచి ఉండే ఎం.పీ.డీ.కే అరుణమ్మ చొరవతో మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్ లో యశ్వంతపూర్ రైలు ఆగడంతో ఇక్కడి నుండి సుదూర ప్రాంతాలు అయిన నాందేడ్, మధ్యప్రదేశ్ రాజస్థాన్, ఢిల్లీ వంటి మహానగరాలకు ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ అవకాశం కల్పించిన మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీ.కే.అరుణమ్మ కు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.




# కదులుతున్న రైలు ఎక్కబోతు కాలు జారిపడ్డ ప్రయాణికుడు

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ...**

**నారాయణపేట జిల్లా**



కదులుతున్న రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు కాలు జారిపడి రెండు కాళ్లు కట్ అయిపోయిన సంఘటన గురువారం కృష్ణా రైల్వే స్టేషన్ లో జరిగింది. కృష్ణా రైల్వే పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం యశ్వంత్ పూర్ ఎక్స్ ప్రెస్ కృష్ణ రేల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుండగా రాయచూరు జిల్లా నివాసి లక్ష్మణ్ వయస్సు 60 సంవత్సరాలు గా గుర్తించారు. అనంతరం చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతి వనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

భూమి కోసం,విముక్తి కోసం,దోపిడికి వ్యతిరేకంగా తిరగబడి అసువులు బాసిన అమరవీరుల స్మారకార్థం ఇంద్రవెల్లిలో స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలన్నది ఇక్కడి గిరిజనుల చిరకాల స్వప్నమని,ఎట్టకేలకు ఆ కల నెరవేరిందని పర్యాటక,సాంస్కృతిక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.రేవంత్ రెడ్డి సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని స్మృతి వనంగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని,అవసరమైన నిధులను కూడా వెంటనే మంజూరు చేశారని గుర్తు చేశారు.కోటి రూపాయలతో స్మృతి వనాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు.ఈ స్మృతి వనం వద్ద ఏటా ఆదివాసి అమరులకు స్వేచ్ఛా వాతావరణంలో నివాళులు అర్పించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని చెప్పారు.అనంతరం గిరిజన సంక్షేమ శాఖ,సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ - ఉట్నూర్,ఆద్వర్యం లో ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబ సభ్యులకు 10 లక్షల రూ.ల విలువగల ట్రైకార్ యూనిట్లను పంపిణీ చేశారు.



# మంత్రి జూపల్లికి ఘన స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్,పర్యాటక శాఖ,ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదిలాబాద్ లో ఘన స్వాగతం లభించింది.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మావల బైపాస్ వద్ద పూల బొకే అందించి ఘన స్వాగతం పలికారు.శాలువాతో సత్కరించారు.అనంతరం స్థానిక పెన్ గంగా అతిథి గృహం వరకు ర్యాలీగా తరలి వచ్చారు.



# నకిలీ ఎలక్ట్రిక్ వైర్లు విక్రయించిన షాపు యజమాని అరెస్టు,రిమాండ్.

### వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్,ఎస్ఐ నాగనాథ్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**


ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ నందు నకిలీ వి గార్డ్ ఎలక్ట్రిక్ వైర్లు మరియు గోల్డ్ మెటల్ ఎలక్ట్రిక్ సాకెట్లు విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం కంపెనీ ప్రతినిధులు నిందితుడు దేవాసి హర్షన్ తండ్రి పేరు వినరాం,వయస్సు 32, కృష్ణ ఎలక్ట్రికల్ షాప్ యజమాని,ఆదిలాబాద్ షాప్ నందు కొనుగోలు చేయగా వారికి నకిలీ సామాగ్రి ఇచ్చి మోసం చేయడం జరిగిన ఘటనలో కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేయగా,నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగిందని ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలియజేశారు.చిత్రంలో స్వాధీనం చేసుకున్న వస్తువులతో ఎస్ఐ నాగనాథ్ ఉన్నారు.




# ప్రభుత్వ ఉపాధ్యాయుడు కె. జి. విజయ భాస్కర్ రెడ్డి అకాల మరణం. అమరచింత లో విషాదఛాయలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**

**అమరచింత వనపర్తి జిల్లా.**



అమరచింత మండల కేంద్రానికి చెందిన కే.జీ. విజయభాస్కర్ రెడ్డి అనారోగ్యంతో అకాల మరణం చెందాడు దీంతో అమరచింత విషాదఛాయలు నెలకొన్నాయి.అమరచింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-1983 సంవత్సరంలో 10 వ, తరగతి అభ్యసించారు. ఉన్నత చదువులు అభ్యసించిన విజయ భాస్కర్ రెడ్డి ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు మ్యాథమెటిక్స్ బోధించి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకొని పోయారు. ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తు అనారోగ్యంతో ఆకస్మాత్తుగా గురువారం హాస్పిటల్ లో మరణించాడు. ఆయన అకాల మరణం తో అమరచింత లో విషాదఛాయలు అలముకున్నాయి. విజయ భాస్కర్ రెడ్డి మరణం బాధాకరం. అమరచింత మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కేజీ విజయభాస్కర్, అకాల మరణం చెందాడు. అయన మరణం చాల బాధాకరమని క్లాస్మేట్స్ కిన్నెర అర్జున్ కుమార్, ఎస్. నారాయణ, టి. స్వామి, బండల వెంకట రాములు, కుమ్మరి వెంకటయ్య,మోదీ నాగరాజు, మంత్రి పాండు, తిమ్మరాజు, శివాజీ, భగవంతు రెడ్డి,డీలర్ వెంకటేశ్వర శెట్టి, డీలర్ రాములు, దిడ్డి శ్రీహరి, కొంగరి ప్రభాకర్, రియాజ్, శ్రీనివాస్ యాదవ్,మోదీ రవి,మెర్వ పద్మ, మెర్లిన్, సత్యవేణమ్మ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.అయన మరణం చాలా బాధాకరమని అన్నారు.

# చిన్నారిని చంపి, భార్యపై హత్యాయత్నం

**కర్నూలు,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

కర్నూలు జిల్లా దేవనకొండలో దారుణం చోటు-చేసుకుంది. 8 నెలల కుమారుడిని తండ్రి నరేశ్ చంపేసి పొలంలోని నీటి డ్రమ్ములో వదిలేశాడు. అనంతరం భార్య శ్రావణిపై హత్యాయత్నం చేశాడు. పొలంలో తీవ్రగాయాలతో పడి ఉన్న ఆమెను అత్తమామలు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రావణి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటు-ంబ కలహాలతో ఈ ఘటన చోటు-చేసుకున్నట్లు- భావిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. గతంలో మొదటి భార్యను నరేశ్ చిత్రహింసలకు గురిచేసి ఆమె మృతికి కారణమైనట్లు- ఆరోపణలున్నాయి.

# ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకం: చంద్రబాబు

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. జిల్లాల కొత్త కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తన ఆలోచనలు, అంచనాలు అందుకొని బెస్ట్ పెర్ఫామెన్స్ ఇవ్వాలని సూచించారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని చెబుతున్నా.. మీరూ అదే పాటించండన్నారు. అన్నింటికీ రూల్స్ కాదు.. మానవీయ కోణంలో పనిచేయాలని తెలిపారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్ గా మారాయని.. రియల్ -టైమ్‌లో కలెక్టర్లు స్పందించాలని సూచించారు.

# నంద్యాలలో సిసి రోడ్డును ప్రారంభించిన మంత్రి ఫరూక్

### సకాలంలో పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు అభినందనలు

**నంద్యాల,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో రూ.1.40 కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డును రాష్ట్ర న్యాయ శాఖ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ లాంచనంగా ప్రారంభించారు. గురువారం నంద్యాలలోని పద్మావతి నగర్ స్పోర్ట్స్ స్టేడియం వద్ద నుండి పద్మావతి నగర్ ఆర్చి వరకు నిర్మించిన సి సి రోడ్డును మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆర్డిఓ విశ్వనాధ్ లతో కలిసి రాష్ట్ర మంత్రి ఫరూక్ ప్రరాభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఇంత నాణ్యతగా సిసి రోడ్డును నిర్మించడం పిఎవి గ్రూప్ చైర్మన్ కాంట్రాక్టర్ పబ్బతి వేణు గోపాల్ అభినందనీయమన్నారు. అనంతరం పబ్బతి వేణుగోపాల్ ను మంత్రి ఫరూక్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పబ్బతి వేణుగోపాల్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో సహకరించిన షాపు యజమానులు, మున్సిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గురప్ప యాదవ్ ,డి ఇ లు నాగభూషణ్ రెడ్డి, పవన్, రసూల్ ఏఈ హిమబిందు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి అజయ్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అమరులకు నివాళి అర్పించిన అధికారులు

**నంద్యాల,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

భారతదేశంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటారు. దేశంలోని అడవులు, వన్య ప్రాణులను రక్షించడానికి తమ ప్రాణాలను త్యాగం చేశారు. పట్టణానికి సమీపాన పాత నగరవణంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా డిఎఫ్ ఓ నాగమనేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా అటవీ అమరవీరులకు నివాళులర్పించారు. డోన్ ఫారెస్ట్ రేంజర్ పి ప్రవీణ్ కుమార్ డోన్ డిఆర్ఓ రవీంద్రనాయక్, బనగానపల్లె డిఆర్ఓ పాణ్యం డిఆర్ఓ డోన్ ఫారెస్ట్ సిబ్బంది, నంద్యాల జిల్లాలోని అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

### ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన: టిజి భరత్

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఓ వైపు సంక్షేమంతో పాటు-.. మరోవైపు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే పలు సంస్థలు ఏపీకి వస్తుండగా.. మరికొన్ని కంపెనీలు రాష్ట్రం వైపు చూస్తున్నాయి. అయితే, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అని మంత్రి టిజి భరత్ అన్నారు.. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవని అన్నారు. గురువారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఇష్టానుసారం పంచుతున్నారు అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందుకే వైసిపి నేతలు కుట్రతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిటైల్డ్.. ప్రాజెక్ట్ రిపోర్ట్ ఉంటేనే.. ల్యాండ్ అలాట్ అవుతుందని స్పష్టం చేశారు. నిబంధనల తర్వాత సేల్ డీడ్ ఇస్తారు. ఇష్టారాజ్యంగా భూ కేటాయింపు జరగదని తెలిపారు. ఊరికే భూ కేటాయింపులు జరగవు. ఈ వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు అని టీ-జీ భరత్ సూచించారు.

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

**కాకినాడ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

పందలపాక శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు- పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. బుధవారం ఎస్కేవీటి డిగ్రీ కళాశాల రాజమండ్రి నందు జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 చెస్ క్రీడ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పందలపాక పాఠశాలకు చెందిన జి విమలశ్రీ, పి. లీల స్వాతి పదవ తరగతి విద్యార్థినిలు త్వరలో జరిగే ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యతోపాటు- క్రీడలలో కూడా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్నత స్థానానికి వెళ్లేలా ప్రోత్సహించడం జరుగుతుందని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కూడా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు యువ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఇవ్వడం జరుగుతుందని, రాష్ట్రస్థాయి పోటీ-లకు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఎంపి-కై-న క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయుడు అభివృద్ధి కమిటీ- అధ్యక్షులు కోణాల సత్తిరాజు, ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీరి రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ- చైర్మన్ పంపన వీర సత్యనారాయణ, కళాశాల సీనియర్ ఉపాధ్యాయులు నాగబాబు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామస్తులు నాయకులు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

# నంద్యాల జిల్లాలో భారీ వర్షం చిప్పగిరిలో నీట మునిగిన పంటలు

**నంద్యాల,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

నంద్యాల జిల్లాతో పాటు పట్టణంలో గత రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి వరకు వర్షం దంచి కొట్టింది. చిప్పగిరిలో గురువారం భారీ వర్షం దంచి కొట్టింది. మండలంలో 68.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు- అధికారులు కూడా తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రి రెండు గంటల సమయంలో మండలంలోని పలు గ్రామాలలో భారీగా వర్షాలు కురిశాయి. మండలంలోని బెల్డోన గ్రామం పెట్రోల్ బంకు దగ్గర ఉన్న వాగు ఎన్నడూ లేనంతగా ఉధృతంగా పొంగి పొర్లింది. దీంతో శుక్రవారం ఉదయం వరకు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే సంగాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడి కేంద్రం బయట ప్రాంతమంతా వరద నీరు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. పొలాలలో సాగు పైరంతా కూడా వరద నీరుకు కొట్టుకుపోయినట్లు- పలు రైతులు తెలిపారు. కంది, పత్తి తదితర పంటలు వేసుకున్న రైతులందరూ వర్షం వల్ల పంటలు కుళ్ళిపోతాయని ఆవేదనకు గురవుతున్నారు. అలాగే అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రమునకు చుట్టూ ఎత్తుగా గ్రావెల్ వేయించి విద్యార్థులకు న్యాయం చేయాలని సంగాల గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు భారీ ఎన్‌కౌంటర్

### పదిమంది మావోల మృతి

**ఖమ్మం,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు- చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ- సభ్యుడు మనోజ్ అలియాస్ మోదెం బాలకృష్ణ సహా 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఒడిశా రాష్ట్ర కమిటీ- సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు కూడా ఉన్నారు. సంఘటన స్థలి నుంచి మృతదేహాలతోపాటు- పెద్ద ఎత్తున ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గరియాబాద్ ఈ30, ఎస్‌టీ-ఎఫ్, కోబ్రా జవాన్లు ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రఖేచా ఎన్‌కౌంటర్‌ని పర్యవేక్షిస్తున్నారు.

# రాజరాజేశ్వరి పేటలో ప్రత్యేక వైద్య బృందం

### డయేరాయి ప్రబలడంతో కలెక్టర్ చర్యలు

**విజయవాడ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

విజయవాడలోని రాజరాజేశ్వరిపేటలో ప్రబలుతున్న డయేరియా కేసుల నేపథ్యంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పలు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం 41 మందికి చికిత్స అందిస్తున్నామని, అందరి పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. చికిత్స తీసుకొని ఆరోగ్యం మెరుగుపడటంతో ఇప్పటి వరకు 22 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రత్యేక వైద్యాధికారులతో ఆర్‌ఆర్ పేటలో వైద్య శిబిరంను ఏర్పాటు- చేశామని తెలిపారు. ముందు జాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి 15 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. డయేరియా కేసులపై కలెక్టర్ కార్యాలయంలో 91549 70454తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేశామని ప్రకటించారు. పరిస్థితి చక్కదిద్దేందుకు, సమన్వయానికి రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు- చేస్తున్నట్లు- తెలిపారు. ప్రత్యేక బృందాలు ఆర్‌ఆర్ పేటలో ప్రతి ఇంటినీ పర్యవేక్షిస్తున్నాయన్నారు.

# తురకపాలెంపై అధ్యయన బృందం ఏర్పాటు

**గుంటూరు,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

గుంటూరు జిల్లా తురకపాలెంలో మరణాలకు కారణం తెలుసుకునేందుకు ప్రభుత్వం మరణ అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేసిందని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత మరణాలకు కారణం తెలుస్తుందన్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు అధిక మోతాదులో యాంటీ-బయాటిక్స్ ఇవ్వకూడదని, అందుకే అతని క్లినిక్ సీజ్ చేశామని తెలిపారు. గ్రామంలో తాగునీరు సురక్షితమని నివేదికలు వచ్చాయని, గతవారం రోజుల్లో జీజీహెచ్ ల్యాబ్‌లో చేసిన బ్లడ్ కల్చర్ పరీక్షల్లో మెలాయాయిడోసిన్ బయటపడలేదని చెప్పారు. ఈ నమూనాలను మరోసారి ఎయిమ్స్‌కు పంపుతామన్నారు.

# టిటిడి సభ్యుడిగా టివిఎస్ మోటర్స్ అధినేత

### సుదర్శన్ వేణును నియమిస్తూ ఉత్తర్వులు

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ప్రముఖ వ్యాపారవేత్త టీవీఎస్ మోటార్స్ అధినేత సుదర్శన్ వేణును టీటీడీ బోర్డు కొత్త సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నియమితులైన ఓ సభ్యుడు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఖాళీగా ఉన్న స్థానాన్ని సుదర్శన్ వేణు నియామకంతో భర్తీ చేశారు. గతంలో 29 మందితో టీటీడీ పాలకమండలిని ఏర్పాటు చేసింది. అప్పట్లో పాలకమండలి సభ్యుడిగా ఎంపికైన జస్టిస్ హెచ్.ఎల్. దత్తు తన బాధ్యతలు స్వీకరించకపోవడంతో అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగానే ఉంది. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న సభ్యుడి స్థానాన్ని భర్తీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. జస్టిస్ దత్తు స్థానంలో సుదర్శన్ వేణును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. టీటీడీ బోర్డు సభ్యుడిగా సుదర్శన్ వేణు నియామకంతో పాలకమండలి పూర్తి స్థాయిలో కొలువుదీరినట్లయ్యింది. త్వరలోనే సుదర్శన్ వేణు టీటీడీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు- తెలుస్తోంది.

# సీతారం ఏచూరి ప్రథమ వర్ధంతి

### కాకినాడలో రక్తదాన శిబిరం

**కాకినాడ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

సిపిఎం అగ్రనేత దివంగత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం కాకినాడ సుందరయ్య భవన్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ- సభ్యులు దుంపల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కె. సత్తిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మన కాకినాడ వాసి కావడం గర్వకారణమన్నారు. సీతారాం ఏచూరి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన మార్క్సిస్టు నేత అని కొనియాడారు. కాకినాడ నగరం లో తోలుబొమ్మలాట కళాకారుల ఉత్సవం నిర్వహణలో, గాంధీభవన్ లో లైబ్రరీ నిర్మాణంలో ఆయన పాత్ర ఉందన్నారు. కాకినాడ సుందరయ్య భవన్ ని కూడా ఆయనే ప్రారంభించారని తెలిపారు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం కవిసమ్మేళనం , గురువారం రక్తదాన శిబిరం, శుక్రవారం బాలాజీ చెరువు సెంటర్ లో కళాప్రదర్శనలు ఏర్పాటు- చేసామన్నారు. సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమాలు పోరాటాలతో పాటు- సేవా సహాయ కార్యక్రమాల్లో కూడా సిపిఎం కార్యకర్తలు ముందుంటారని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, సిహెచ్. సతీష్, సిహెచ్. రాజ్ కుమార్, సిహెచ్. రమణి, ఆర్. వెంకటలక్ష్మి, జి. భూలక్ష్మి, పి. సూర్య, సి. వెంకట్రావు, రామకృష్ణ లతో పాటు- పలువురు కార్మికులు రక్తదానం చేశారు. కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా. కామరాజు బృందం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ- సభ్యులు ఎం. రాజశేఖర్ తో పాటు- కె. వీరబాబు, యు. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థి మృతి

## యాజమాన్యమే కారణమంటూ తల్లిదండ్రుల ఆందోళన

**హనుమకొండ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

హనుమకొండ నయీమ్‌నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అకస్మాత్తుగా విద్యార్థి ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే, విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు- వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ఈ క్రమంలో పాఠశాల ముందు పలువురు ఆందోళనకు దిగారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆస్తికోసం కన్నతల్లిని కడతేర్చిన కూతురు

## జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో ఘటన

**జనగామ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఆస్తి కోసం కన్నతల్లిని కసాయి కూతురు చంపింది. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన లక్ష్మి అనే మహిళకు సంగీత అనే కూతురు ఉంది. ఐదేళ్ల క్రితం వీరయ్య అనే యువకుడితో తన కూతురు పెళ్లి చేసింది. వివాహ సమయంలో కట్నం కింద లక్ష్మి తన ఎకరం భూమిలో 20 గుంటలు అమ్మి, ఆ డబ్బుతో 9 తులాల బంగారం చేయించి కూతురుకి కట్నం కింద అప్పజెప్పింది. అయితే మిగిలిన భూమి, డబ్బు కూడా తనకు ఇవ్వాలని సంగీత తన తల్లిని పలుమార్లు వేధించింది. భూమి ఇవ్వనని లక్ష్మి నిరాకరించడంతో సంగీత తన భర్తతో కలిసి తల్లిని చంపేందుకు ప్లాన్ వేసింది. లక్ష్మి నిద్రిస్తున్న సమయంలో భర్తతో కలిసి ఆమె గొంతు నులిమి చంపింది. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిసి రిజర్వేషన్ బిల్లుపై అసత్య వార్తలు

## బిల్లు ఇంకా గవర్నర్ వద్దే పెండింగ్

## వివరణ ఇచ్చిన రాజ్‌భవన్ అధికారులు

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లుపై సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వార్త అవాస్తవమని రాజ్‌భవన్ అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు ఇంకా పెండింగ్‌లోనే ఉందని తెలిపారు. రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో.. విలీనం చేస్తూ.. జారీ చేసిన మెమోతో ఈ గందరగోళం నెలకొందని వివరించారు. అయితే.. గత కొన్ని గంటలుగా.. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లకు లైన్ క్లియర్ అయ్యిందని.. సోషల్ మీడియాలో, ప్రముఖ టీవీ ఛానల్స్‌లో ప్రచారం అయ్యింది. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు-, 50 శాతం రిజర్వేషన్ల క్యాప్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంటు-న్నట్లు- వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ మేరకు స్పందించిన రాజ్‌భవన్ అధికారులు ఇదంతా అవాస్తవమని తేల్చి చెప్పారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

## విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపుర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్‌సిటీ- పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు- కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి సిటీ-వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. యాకుత్‌పురాలో ఓ చిన్నారికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆరేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడింది. బాలిక వెనుక వస్తున్న ఓ మహిళ ఇది గమనించారు. వెంటనే అప్రమత్తమై చిన్నారిని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్‌లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు-ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్-హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్‌ను తొలగించారు.

# హైదర్‌గూడ్ ఇఫ్ఫ్ గార్డెన్ స్వాధీనం

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

హైదర్‌గూడ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎఫ్ గార్డెన్‌ను హిమాయత్‌నగర్ ఎమ్మార్వో సీజ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో ఫంక్షన్ హాల్ నడుపుతున్నట్లు- గతంలో కేసు నమోదైంది. గత కొంతకాలంగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇటీ-వల అది ప్రభుత్వానిదేనని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసు సెక్యూరిటీ- నడుమ రెవెన్యూ అధికారులు ఫంక్షన్ హాల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులతో మజ్లీస్ నేతలు వాగ్వాదానికి దిగారు.

# అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

## -విధి నిర్వహణలో వారి సేవలు అమోఘం-అడవుల రక్షణ కోసంఎందరో ప్రాణత్యాగం

## -అటవీ అమరుల దినోత్సవంలో మంత్రి సురేఖ







**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిలతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11 వ తేదీన అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవటం జరుగుతుందని అన్నారు. ఇదే రోజు 1730 వ సంవత్సరంలో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లు- రక్షించుటకు తమ ప్రాణ త్యాగం చేసారని మంత్రి తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగము చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటు-న్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు 22మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసి అటవీ నేరములకు పాల్పడిన నేరస్తులను పట్టు-కొనుటలో, అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించినారని ఈ సందర్భంగా వారి అమూల్యమైన సేవలను గుర్తు చేశారు.అదేవిదంగా అడవులు మరియు వన్య ప్రాణులను రక్షించటంలో నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేసి అటవీ రక్షణలో భాగంగా 2014 నుండి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలపకు సంబంధించిన నేరాలను అలాగే 10375 అటవీ భూ ఆక్రమణ కేసులను కూడా పెద్దసంఖ్యలో నమోదు చేయడం జరిగిందని అన్నారు. అలాగే 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96813 కేసులు నమోదు చేసి రూ.లు 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 18002 వాహనములను కూడా స్వాధీనపరచుకోవడం జరిగిందని అన్నారు. నేరస్తులు తెలియని కేసులు 29858 (÷ఖఉక్ష) నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు మరియు మారు జాతి కలపను స్వాధీనపర్చుకొని జప్తు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిదంగా అమూల్యమైన అటవీ సంపదను పరిరక్షించడానికి ప్రజల భాగస్వామ్యముతో ఎన్నో పథకాలను మరియు చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు- చేయడము జరిగినదని పేర్కొన్నారు.అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం,??సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. పి. డి. యాక్ట్ మేరకు టేకు అక్రమ రవాణాదారులను కూడా అరెస్టు చేయడం జరుగుతున్నదని, అటవీ శాఖ సిబ్బంది పోలీసు అధికారుల సాయముతో ఇపటివరకు (5) కేసులు నమోదు చేశామని అన్నారు. అటవీ శాఖ సిబ్బందిని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అదేవిదంగా అటవీ సంరక్షణ బలోపేతానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2118 వాహనాలు, (2008 మోటారు సైకిళ్ళు, ఎఫ్.బి.ఓ నుండి డి.ఆర్.ఓ వరకు, (110) మహీంద్ర తార్ జీపులు అటవీ క్షేత్రాధి కారులకు అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2022 సంవత్సరంలో (1516) రిక్రూట్‌మెంట్ కొరకు అనుమతి ఇచ్చిందని, అందులో భాగంగా (1393) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (15) మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, (18) మంది ఏసిఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్‌మెంట్ పక్రియలోఉన్నాయని పేర్కొన్నారు. అడవుల రక్షణ మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడం కోసం అనేక సమగ్ర చర్యలు ప్రారంభించబడ్డాయని అలాగే వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపరచడానికి పలు కార్యక్రమాలు చేపట్ట ఉన్నట్లు- మంత్రి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలుపుతూ మృతుల కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపరచి అమరుల స్తూపం వద్ద ఈ సందర్భంగా అమూల్యమైన నివాళులు అర్పించారు. అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్, పిసిసిఎఫ్ హెడ్ సువర్ణ, పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఏలు సింగ్ మేరు, సి సి ఎఫ్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఫారెస్ట్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, అమరుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో జోరువానలు

**వరంగల్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. గురువారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. నాన్ స్టాప్ గా కురిసిన వర్షానికి పలు చోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. ఉమ్మడి వరంగల్ లోని హనుమకొండ, కాజీపేట, పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. జనగామ జిల్లాలోని రఘునాథపల్లి,లింగాలఘనపూర్, బచ్చన్నపేట, నర్మెట్ట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి లోతట్టు- ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇదిలా ఉండగా..

# కాకినాడ మత్స్యకారులకు విముక్తి

## శ్రీలంక జైలు నుంచి నలుగురు విడుదల

**కాకినాడ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, అక్కడి జైల్లో ఉన్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు విడుదలయ్యారు. ఆగస్టు 4న కాకినాడలోని జగన్నాధపురం ప్రాంతానికి చెందిన బ్రహ్మానందం సహా మరో ముగ్గురు మత్స్యకారులను అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారన్న కారణంతో శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్.. శ్రీలంకలోని భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయి మురళితో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఎప్పటికప్పుడు దిల్లీలోని విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. శ్రీలంకలోని భారత దౌత్య అధికారులు విస్తృత సంప్రదింపులు జరిపి, మత్స్యకారుల తరఫున న్యాయపోరాటం చేసి వారిని విడిపించారు. గురువారం నలుగురు మత్స్యకారులను విడుదల చేసి వారి బోట్లను అప్పగించారు. భారత్ సరిహద్దులో లాంఛనాలు పూర్తయిన తర్వాత బోట్లలో సముద్రమార్గంలో మత్స్యకారులు మరో రెండు రోజుల్లో కాకినాడ చేరుకోనున్నారు.

# అమెరికాలో మృతి చెందిన యువకుడి మృతదేహం రాక

**ఒంగోలు,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

అమెరికాలో స్విమ్మింగ్ పూల్ లో ప్రమాదవశాత్తు మృతి చెందిన బాపట్ల జిల్లా మార్టూరు చౌదరి కాలనీకి చెందిన గ్రానైట్ వ్యాపారి పాటిబండ్ల వేణు బాబు కుమారుడు లోకేష్ (27) మృతదేహం గురువారం మార్టూరుకుచేరుకుంది. ఉన్నత చదువుల కోసం డల్లాస్ వెళ్లి అక్కడే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తున్న లోకేష్ అమెరికా కాలం మానప్రకారం గత గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. అమెరికా ప్రభుత్వ లాంఛనాలు పూర్తి చేసుకొని లోకేష్ మృతదేహం గురువారం మార్టూరు చేరుకుంది. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు రోధించిన తీరు చూపరులను కలచివేసింది.

# రజాకర్ సినిమాలో ఉన్నది ఉన్నట్లు చూపారు

## సినిమాను వీక్షించిన బిజెపి అధ్యక్షుడు

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్ర్యం ఎలా లభించిందో, గ్రామీణ ప్రాంతాల్లో నిజాం పాలనలో జరిగిన అత్యాచారాలు, అరాచకాలను తెలియజేసేలా, ఆర్యసమాజ్ వంటి సంస్థలు రజాకర్లకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాన్ని రజాకర్ సినిమాలో స్పష్టంగా చూపించారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రావు అన్నారు. రజాకర్ చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ లాబ్స్‌లో 'రజాకర్' సినిమా వీక్షించిన అనంతరం బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఈ చిత్రాన్ని కమర్షియల్ ఎలమెంట్స్ లేకుండా, నిజాం పాలనలో రజాకార్లు ప్రజలపై చేసిన దాడులు, అరాచకాల గురించి వాస్తవంగా చూపిస్తూ చరిత్రను కళ్ల ముందు ఉంచారని అభినందించారు. బైరాన్ పల్లి, గుండ్రాంపల్లి, పరకాల, నిర్మల్ వెయ్యి ఉరుల చెట్టు-, జోడేఘాట్ వంటి చారిత్రక ప్రదేశాలు, ఆ ప్రాంతాల్లో జరిగిన పోరాటాలను వివరంగా చూపించారు. భావితరాలకు చరిత్రను తెలియజేయడం ముఖ్య లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం 'రజాకర్' సినిమాకు అవార్డు ప్రకటించిందని గుర్తు చేశారు. గూడూరు నారాయణరెడ్డి చారిత్రాత్మకంగా మంచి సినిమా తీశారని, అన్ని జిల్లాల్లో బీజేపీ కార్యకర్తల ద్వారా ప్రజలకు ఈ సినిమా చూపించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

# గ్రూప్-1పై అప్పీల్ చేయనున్న టిజి పిఎస్‌సి

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

గ్రూప్-1 పరీక్షపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయనున్నట్లు- తెలుస్తోంది. వారం రోజుల్లో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు- సమాచారం. రీవాల్యుయేషన్ చేస్తే టెక్నికల్ సమస్యలు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సింగల్ బెంచ్ తీర్పు కాపీపై లీగల్ టీ-మ్ గ్రౌండ్స్ ప్రిపేర్ చేస్తోంది. గ్రూప్-1 నియామకాల్లో లోపాలు లేవని ఃఖఏఃఊఈ వాదించడానికి సిద్ధం అయ్యింది.

# గొర్రెల స్కామ్ కేసులో ఈడి దూకుడు

## విచారణకు హాజరుకావాలని బాధితులకు నోటీసులు

## కోట్లు గోల్ మాల్ జరిగినట్లు గుర్తించిన ఇడి

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ. 2కోట్లు- మేర మోసం చేసినట్టు- ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతా లకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు- ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. గొర్రెల స్కాంలో మోసపోయా రంటూ ఇప్పటికే ఏపీకి చెందిన గొర్రెల కాపర్లు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 15న విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుండగా.. ఏసీబీ విచారణ ఆధారంగా ఈడీ కూడా దర్యాప్తులోకి దిగింది. ఏపీకి చెందిన గొర్రెల కాపరులకు బ్రోకర్లు రెండు కోట్ల రూపాయలు ఎగవేసినట్లు- గుర్తించింది ఈడీ. ఈ స్కాంకు సంబంధించి ఏపీలో తీగ లాగితే డొంక కదిలినట్లు- తెలుస్తోంది. అధికారులతో బ్రోకర్లు కుమ్మక్కై పథకం నిధులను స్వాహా చేసినట్లు- ఆరోపణలు ఉన్న క్రమంలో ఈ కేసును సీరియస్ గా తీసుకుంది ఈడీ. గొర్రెలు కొనకుండానే కొన్నట్టు- రికార్డులు తయారుచేశారని.. కోట్లు- కొట్టేశారని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాం ద్వారా వేలకోట్లు- చేతులు మారాయని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాంకు సంబంధించి పశుసంవర్ధక శాఖకు చెందిన సీనియర్ అధికారులను అరెస్ట్ చేయగా.. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ ఓఎస్డీపై కూడా కేసు నమోదయ్యింది. గొర్రెల పంపిణీ స్కీం లబ్ధిదారులు అసలు గొర్రెల వ్యాపారంతో సంబంధం లేనివారు ఉన్నట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. అసలు గొర్రెల కొనుగోలు లేదా విక్రయం జరగలేదని.. కానీ వెయ్యి కోట్ల రూపాయలు మాయం చేసినట్లు- పేర్కొన్నారు. నకిలీ విక్రేతలు, ఫేక్ బిల్లులను మళ్లీ మళ్లీ పేర్కొంటూ డబ్బులు దోచుకున్నట్టు- ఆధారాలు గుర్తించారు. ఈడీ సోదాల్లో ప్రభుత్వ అధికారులకు, ఇతరులకు కిక్‌బ్యాక్ లకు సంబంధించిన డాక్యుమెంట్లు-, నకిలీ చెక్ బుక్‌లు, పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# యూరియా కృత్రిమ కొరతకు కాంగ్రెస్ కారణం

**-జాబ్ క్యాలెంటర్ ప్రకటించినా నియామకాలు నిల్-మీడియాతో బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు**

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి**

కాంగ్రెస్ నాయకులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించారని బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. కేంద్రం.. తెలంగాణ వాటా యూరియా ఎప్పుడో ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా అమీర్ పేట్ లో తెలంగాణ జర్నలిస్ట్ యూని యన్ ఆధ్వర్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి అంశంలోనూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గ్రూప్-1 అంశంలో న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని రామచందర్ తెలియజేశారు. గ్రూప్-1 అంశంలో టిజిపిఎస్సి తప్పుల మీద తప్పులు చేసిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం కంటే ఎక్కువ సీట్లు- బిసిలకు ఇస్తామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు రాష్ట్ర కమిటీలో బిసిలకు చోటు- దక్కలేదని విమర్శించారు. అధికార ప్రతినిధుల్లో వరంగల్ కు అవకాశం కల్పిస్తామని రామచందర్ రావు హామీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఇండియా కూటమిలో ఐక్యత లేదని స్పష్టమైందని రామచందర్ రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదు. యూనివర్సిటీ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో యూని వర్సిటీలను నడుపుతూ భావిత రాలను అంధకారంలోకి నెట్టివేస్తు న్నారు. ఉస్మానియా యూని వర్సిటీకి వెళ్లి రూ.వెయ్యికోట్లు- ఇస్తానని సీఎం రేవంత్ గొప్పలు చెప్పారు. దావోస్‌కు వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? దారి ఖర్చులు కూడా వచ్చినట్లు- లేదు.



రాష్ట్రంలో పరిపాలనకు పక్షవాతం వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు తప్ప.. అమలు చేయరు. యువత గురించి ప్రభుత్వం ఆలోచించాలని రామచందర్‌రావు కోరారు.

# నగరంలో కుంభవృష్టి

## పలు ప్రాంతాలు జలమయం

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

హైదరాబాద్ నగరంలో మరోసారి వర్షం దంచికొట్టింది. గురువారం నగరంలోని పలు చోట్ల కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాలు నీట మునిగే పరిస్థితికి చేరుకున్నాయి. పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్యాట్నీ , తార్నాక, ఎల్బీనగర్, పాతబస్తీ ప్రాంతాల్లో వర్షం పడింది. ఉదయం నుంచీ ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.నగరంలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షంతో రహదారులపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు.ఈ క్రమంలో.. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. హయత్‌నగర్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో భారీగా వరద నీరు చేరడంతో.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వరద నీరు నిలవడంతో.. ఆటోనగర్, పెద్ద అంబర్ పేట్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.వనస్థలిపురంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో.. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎల్బీనగర్, నాగోల్, బీఎన్ రెడ్డి నగర్, కొత్తపేట, చైతన్యపురి, పంజాగుట్ట, అమీర్‌పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్‌లో కూడా కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో ఈ వర్షాలు మొదలయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వర్షం కురిసింది. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్ నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, సిద్దిపేట, మెదక్ కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు- వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

## అధికారులను అప్రమత్తం చేసిన సిఎం

## సమన్వయంతో ముందుకు వెళ్లాలని రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు- రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు.. చర్యల్లో భాగంగా.. పునరావాస కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటూ.. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులపై ఉన్న లోతట్టు- కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలపైన అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువులు, కుంటలకు గండిపడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాల్లోకి భారీగా వదర నీరు చేరడంతో చెరువులను తలిపిస్తున్నాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. హయత్‌నగర్‌లో అత్యధికంగా 9 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిని వరద ముంచెత్తింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

# మెదక్ పట్టణంలో మరోమారు వర్ష భీభత్సం

## భారీ వర్షంతో నీట మునిగిన పట్టణం

**మెదక్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మెదక్ పట్టణంలో గురువారం ఉదయం వర్షం దంచికొట్టింది. పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోమారు ఉదయం వాన దంచి కొట్టడంతో వాగులు ఉధృతంగా ప్రవహించాయి.ఆగస్ట్ 27 నుంచి 29 దాకా కురిసిన భారీ వర్షాలు మెదక్ జిల్లాకు అపార నష్టాన్ని కలిగించిన సంగతి తెలిసిందే. చెరువులకు గండ్లు పడడంతో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వరద ఉధృతికి ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. అనేక రూట్లలో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమయింది. వందలాది విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి, ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సబ్ స్టేషన్లు డ్యామేజీ అయ్యాయి. మైనర్ ఇరిగేషన్ చెరువుల కట్టలకు, కాల్వలకు గండ్లు పడ్డాయి. వందల సంఖ్యలో ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఆగస్ట్ 27 నుంచి 29 దాకా కురిసిన వర్షాలకు మంజీరా నది, హల్దీ, పుష్పాల, పసుపులేరు, గుండు, నక్క వాగులు ఉధృతంగా ప్రవహించాయి. వరద ప్రభావంతో ఆయా మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. మెదక్, సిద్దిపేట, రామాయంపేట, తూప్రాన్ పట్టణాల్లో అనేక కాలనీలు, సంగారెడ్డి జిల్లాలో లోతట్టు- ప్రాంతాలు జలమయమయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 99.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొమురవెల్లి మండలంలో అత్యధికంగా 206.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పట్టణంలోని కోమటిచెరువు మత్తడి దూకింది. శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస నగర్, హైదరాబాద్ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్సాన్ పల్లి రోడ్డు ప్రాంతాల్లో మత్తడి కాలువ పొంగిపొర్లడంతో వరద ఇండ్లలోకి చేరింది.

# మహిళలకు నాణ్యమైన బతుకమ్మ చీరలు

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మహిళలకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా కానుక ఇవ్వనుంది. ఒక్కో మహిళకు రెండు చీరల చొప్పున ఇవ్వనున్నారు. ఈ కానుకకు సంబంధించి సమాఖ్య సంఘాల మహిళల జాబితాను సెర్ఫ్, మెప్మా రూపొందించాయి. ముందుగా తొలి విడతకు సంబంధించిన చీరలు ఒకటి రెండ్రోజుల్లో రానున్నాయి. బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డుల్లో పేరున్న మహిళలకు బతుకమ్మ చీరలు అందించింది. అయితే కొందరికి అందకున్నా.. చాలా మంది ఈ చీరలు తీసుకున్నారు. అయితే తీసుకున్న వారు సైతం ఈ చీరలు నాసిరకంగా ఉన్నాయని ఉపయోగించలేదు. రైతులయితే వీటిని జొన్న, మొక్కజొన్న వంటి చేన్ల వద్దకు పక్షులు రాకుండా ఉంచడానికి ఉపయోగించారు. దీనికి సంబంధించిన వీడియోలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన సంగతి తెలిసిందే. వీటిని షోలాపూర్ లో కిలోచొప్పున కొనుగోలు చేశారంటూ అప్పట్లో ప్రచారం జరిగింది. బతుకమ్మ, దసరా కానుకగా మంచి నాణ్యమైన చీరలు మహిళలకు కానుకగా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఈ యేడు సంఘాలకుచీరలు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

# మేనత్తను గొడ్డలితో నరికి చంపిన దుండగుడు

**ములుగు,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఇప్పలగూడెంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. మేనత్త కొండగొర్ల ఎల్ల(50)ను అదే గ్రామానికి చెందిన మేనల్లుడు కొండగొర్ల విజయ్ కుమార్ చంపేశాడు. మద్యం మత్తులో గొడ్డలితో దారుణంగా హత్య చేశాడు. జల్సాలు, మద్యానికి బానిసైన విజయ్ కుమార్ డబ్బులు ఇవ్వాలని మేనత్తను డిమాండ్ చేశాడు. నిరాకరించిన ఆమె ఆరుబయటకు వెళ్లగా రోడ్డుపై అతి కిరాతకంగా గొడ్డలితో హతమార్చాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఎల్లమ్మ మృతదేహాన్ని చూసి స్థానికులు నిర్ఘాంతపోయారు. నిందితుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సీఐ ముత్యం రమేశ్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటనా స్థలిని పరిశీలించారు. బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరించారు.

# ఉగ్రలింక్‌తో ఉన్న వ్యక్తిపై దర్యాప్తు

**నిజామాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఉగ్రలింకుల ఘటనలో దర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం బోధన్‌లో ఓ యువకుడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం ఢిల్లీకి తీసుకెళ్లారు. మరోవైపు ఉగ్రవాదులతో యువకుడికి సంబంధం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఝార్ఖండ్‌లోని రాంచీలో బాంబు దాడులకు కుట్ర పన్నుతున్న డానిష్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. అతన్ని విచారిస్తున్న క్రమంలో బోధన్ యువకుడి పేరు బహిర్గత మైంది. ఈక్రమంలో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక వీడియోకాల్ యాప్ ద్వారా నిందితులు తరచూ మాట్లాడుకుంటున్నట్లు- గుర్తించారు. మరింత లోతైన విచారణకు అతడిని ఢిల్లీ తరలించారు.

# జూబ్లీహిల్స్ పోటీలో లేను దానం నాగేందర్ స్పష్టీకరణ

**హైదరాబాద్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అధిష్ఠానం సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తాను పోటీలో ఉన్నట్లుగా వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చాలా ముఖ్యమని దానం నాగేందర్ అన్నారు. అక్కడి నుంచి పోటీ- చేయనున్నట్లు- వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అవన్నీ ఊహాగానాలేనని స్పష్టం చేశారు. టికెట్ ఎవరికి కేటాయించినా పార్టీ గెలుపుకోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



# హమాస్ నేతలు లక్ష్యంగా ఖతార్‌పై దాడులు

## దాడులను సమర్థించుకున్న నెతన్యాహు

**టెల్ అవీవ్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

హమాస్ కీలక నేతలే లక్ష్యంగా ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ చేసిన దాడులను పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను.. అమెరికా లో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. గురువారం ఆయన ఓ వీడియోలో మాట్లాడారు. హమాస్‌తో యుద్ధానికి దారితీసిన అక్టోబరు 7 నాటి దాడులను ఆయన ప్రస్తావించారు. వీటిని అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చుతూ.. నాడు యూఎస్ ఎలా స్పందించిందో ప్రస్తుతం తాము అలాగే చేశామన్నారు. దాడుల తర్వాత వాటికి కారణమైన ఉగ్రవాదులు ఏ దేశంలో ఉన్నా వెంటాడి హతమారుస్తామని నాడు అమెరికా చెప్పింది. దీనిపై ఐక్యరాజ్యసమితిలో తీర్మానం కూడా చేసింది. ఇప్పుడు మేము అదే చేశాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈసందర్భంగా అఫ్గానిస్థాన్‌లో అల్-ఖైదా ఉగ్రవాదులను వెంటాడి, అనంతరం పాకిస్థాన్‌లో ఉన్న కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా నేత ఒసామా బిన్‌లాడెన్ ను అమెరికా బలగాలు చంపేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తమ చర్యలను ఖండిస్తున్న పలు దేశాలను నెతన్యాహు తప్పుబట్టారు. ఆత్మరక్షణ కోసం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇందుకు తమను ప్రశంసించాల్సింది పోయి.. తప్పుబడుతున్నారంటూ అసహనం వ్యక్తంచేశారు. మరోవైపు.. ఖతార్ పై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హమాస్ కు ఆ దేశం సురక్షితమైన స్వర్గధామంగా మారిందన్నారు. ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తోందన్నారు. ఖతార్‌తో సహా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలను ఈసందర్భంగా ఆయన హెచ్చరించారు. అలాంటివారిని బహిష్కరించాలని, లేదంటే చట్టం ముందు నిలబెట్టాలన్నారు. అలా చేయకపోతే.. ఇజ్రాయెల్ చర్యలకు దిగుతుందన్నారు. కాల్పుల విరమణకు సంబంధించి యూఎస్ ప్రతిపాదన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ- అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వారెవరూ ప్రాణాలు కోల్పోలేదు. అయితే, ఈ దాడులను ఖతార్ తీవ్రంగా పరిగణించింది. భారత్‌తో సహా పలు దేశాలు ఈ దాడులను ఖండించాయి.

# బిల్లుల ఆమోదంలో గవర్నర్, రాష్ట్రపతిలకు నిర్దిష్ట గడవు

## కేసులో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వ్ చేసినం సుప్రీం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

పెండింగ్ బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణీత సమయం లోపు ఆమోదం తెలపాలంటూ జరిగిన విచారణపై సుప్రీంకోర్టు తన తీర్పును గురువారం రిజర్వ్ చేసింది. ఈ అంశంపై దాదాపు 10 రోజులపాటు- సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. అనంతరం ఈ కేసులో తుది తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు- ప్రకటించింది. రాష్ట్రపతి కానీ, గవర్నర్లు కానీ బిల్లులు ఆమోదించకుండా పెండింగ్‌లో పెడితే.. ఆటోమెటిక్‌గా మూడు నెలల తర్వాత అవి ఆమోదం పొందినట్లేనంటూ గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక ఈ తీర్పులోని అంశాలపై ఉన్నత న్యాయస్థానం రిఫరెన్స్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ కోరిన విషయం విదితమే. అయితే గతంలో తమిళనాడు కేసులో గవర్నర్లు నిరవధికంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం లేదని.. నిర్దిష్ట సమయంలోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ తీర్పు ప్రకారం.. కోర్టు నిజంగా అలాంటి - టైమ్ లైన్‌లు విధించే అధికారాన్ని కలిగి ఉందా?, గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయా? అనే అంశాలపై విస్తృత చర్చ జరిగింది. వాదనల సందర్భంగా కేంద్రం తరఫు న్యాయవాది.. ఇలాంటి సమయ పరిమితులు విధించడం రాజ్యాంగ సమతుల్యతను దెబ్బ తీయవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదించారు.అలాగే తమిళనాడు, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలు మాత్రం ప్రజాస్వామ్య దేశంలో బాధ్యతగా గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలకు సమయం అవసరమని స్పష్టం చేశాయి. అయితే ఈ తుది తీర్పులో మాత్రం సుప్రీంకోర్టు.. గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై క్లారిటీ- ఇవ్వడమే కాకుండా.. ఈ తరహ బిల్లులు నిలిపివేత పై భవిష్యత్తులో అనుసరించాల్సిన మార్గదర్శకాలపైనా స్పష్టతనిచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ అంశం దేశంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అలాంటి వేళ సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశంపై ఎలాంటి తీర్పు వెలువరించనుందనే అంశంపై ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నాయనే చర్చ సాగుతోంది.

# జ్ఞాన సముపార్జన ముఖ్యం ! (ఆధ్యాత్మికం )

**తిరుమల,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మన జ్ఞానం అందరికీ ఉపయోగపడాలి. ఎందుకంటే మనం సాధించా లనుకొన్న కార్యంలో సన్నిహితులు మనకు సహాయం చేస్తారు. అప్పుడు మన సాధన సులువవుతుంది. జ్ఞానాన్ని సముపార్జించాలి. అదే మనకు మార్గదర్శనం చేస్తుంది. అది మనవరకే కాకుండా నలుగురితో పంచుకోవాలి. నువ్వు ఈ కార్యం సాధించగలవు అంటూ హితులు, మిత్రులు, సహచరులు ధైర్యం చెబితేనే హనుమ సముద్రం దాటి లంకకు చేరి కార్యం సాధించుకొని వచ్చి 'చూశాను సీతను' అనగలిగాడు. మనం ఏదైనా గొప్ప కార్యాన్ని తలపెట్టి పూర్తి చేయాలనుకొంటే మనకో మంచి స్నేహితుడు ఉండాలి. అతడు విమర్శకుడు, మార్గదర్శకుడైతే ఎన్నో మంచి మాటలను ఉపదేశిస్తాడు. అప్పుడు మనం అనుకొన్న సాధన సఫలమై తీరుతుంది. మనందరిలో ప్రత్యేకత ఉంది. కానీ, దాన్ని కనిపెట్టే తీరిక ఓపిక ఉంటే ఏది సాధించడంలోనైనా మనలో ప్రాజ్ఞత వికసిస్తుంది. సూర్యవంశానికి చెందిన భగీరథుడు సగరుడి వారసులకు ఉత్తమ గతులను కలగజేసేందుకు దివిజ గంగను భువికి తెచ్చే మహా ప్రయత్నం చేశాడు. ఈ సాధననే భగీరథ సాధన అన్నారు. ప్రతి మనిషీ అద్భుతంగా జీవించాలని ఆదిశంకరాచార్యులు తరచూ అనేవారట. అలా బతికితే ప్రతి రోజూ సాధనకు మనసు ఉరకలు వేస్తుంది. రాబోయే రోజులన్నీ ఆశాజ్యోతులవుతాయి. ఆదిశంకరులు దేశాన్ని మొత్తం కాలినడకన పర్యటించి తాను తలపెట్టినట్లు నాలుగు పీఠాలను నెలకొల్పగలిగారు. పాశ్చాత్య పురాణాల్లోని నాయకులు కండబలం కలవారు. మన భారతీయ ఇతిహాసాల్లో ధీరులు నైతికంగా ధార్మికంగా బలవంతులు. కండబలం కంటే గుండెబలం మనోబలం శక్తిమంతమైనవి. ఇలాంటి సాధకులే రామాయణ మహాభారత వీర గాథలకు కారకులు.

# ట్రంప్ చెలగాటం..భారత్‌కు ఇరకాటం

## అమెరికాతో జాగ్రత్తగా ఉండడమే మేలు

**వాషింగ్టన్,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హఠాత్తుగా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం , తరవాత స్నేహం కోసం అర్రులు చాచడం చూస్తుంటే ఇదంతా ఓ వ్యూహం ప్రకారమే చేస్తున్నారని తెలుసుకోవచ్చు. బెదిరించి గుప్పిట్లో పెట్టుకోవడం లేదా మరేదో కారణంగా చూడాలి. ఒక దశలో ఆయన ఐరోపా సమాఖ్యకు కూడా భారత్‌పై 100శాతం పన్నులు విధించాలని డిమాండ్ చేశారు. మాస్కోను శిక్షించాలంటే ఇలా చేయాలంటూ ఓ వింత వాదన వినిపించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ తన మిత్రుడని.. భారత్‌తో ఓ ఒప్పందం కుదురుతుందని మళ్లీ స్వరం మార్చారు. గతంలో అమెరికా ఇటువంటి వైఖరిని అనుసరించడాన్ని భారత్ చూసింది. భారత్ విషయంలో తియ్యటి కబుర్లు చెబుతూనే.. ఐరోపా సమాఖ్యను ఉసిగొల్పుతున్నారు. ఇదంతా ఆపరేషన్ సిందూర్ తరవాత గమనించవచ్చు. మరో రకంగా చెప్పాలంటే ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకునే క్రమంలో చేస్తున్న విన్యాసంగా చూడాలి. ఎందుకంటే ట్రంప్‌మాటలు నిజమే అని నమ్మడం ప్రమాదకరమని విదేశీ నిపుణులు సయితం అభిప్రాయపడ్డారు. సరళంగా జరుగుతున్న భారత్-అమెరికా వాణిజ్య చర్చలు ఆయన పరస్పర విరుద్ధ ప్రకటనల కారణంగా సంక్లిష్టంగా మార్చారు. ఐరోపా సమాఖ్యను ఉసిగొల్పడం, భారత్‌తో చర్చలు జరుపుతానని చెప్పడం, టారిఫ్‌లను 50శాతానికి పెంచడం దీనికి బలమైన ఉదాహరణలు అన్నారు. భారత్‌ను యూరోపియన్ యూనియన్ వ్యతిరేక ట్రాప్‌లోకి నెట్టాలని ప్రయత్నిస్తున్నారు. అంటే అధికార బలంతో పరస్పర అంగీకారంతో ఒప్పందాలు చేసుకొనేలా ఒత్తిడి పెంచడం కావచ్చు. నిజంగానే ఇలాంటి ఒప్పందాలు చేసుకొంటే భారత్‌కు ఎటువంటి ప్రయోజనం ఉండదని నిపుణులు చెప్పారు. ట్రంప్ చేష్టలను తాత్కాలికంగా ఆపినా మన ఎగుమతిదారులకు కష్టాలు తప్పవు. భవిష్యత్తులో అమెరికా కుట్రలకు బలి కాకుండా ఉండలేమని కూడా గ్రహించాలి. ఇలాంటి డీల్స్‌ను తప్పించుకోవాలంటే అమెరికా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, ఆటోమొబైల్ మార్కెట్లలో మన దేశ ఉత్పత్తులకు ఎంత అవకాశాలు దక్కుతున్నాయో అన్న అంశంపై భారత్ తొలుత స్పష్టత తెచ్చుకోవాలి. ఎందుకంటే టారిఫ్‌ల పెంపు ఇప్పటికే ఎగుమతులు, జీడీపీ అంచనాలపై ప్రభావం చూపించాయి. కచ్చితంగా చర్చలు జరిపే బృందం ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లను వెనక్కి తీసుకొనేటట్లు-, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలు, బలమైన మార్కెట్ అనుమతులు సాధించేందుకు ఒత్తిడి పెంచాల్సి ఉంటుంది. లేకపోతే మనకు అందే ప్రతి రాయితీని ట్రంప్ ఒక్క పోస్టుతో దూరం చేసే ప్రమాదం ఉంది. 2030 నాటికి ఇరుదేశాల వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చేలా ప్రయత్నాలు చేయాలి. ఈక్రమంలో అమెరికా చేపట్టిన నాన్ టారిఫ్ చర్యలను కూడా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. వీటిల్లో కస్టమ్స్ వాల్యుయేషన్ నిబంధనలు, దిగుమతి లైసెన్స్‌లు, వాణిజ్య సంబంధిత పెట్టుబడుల్లో సమస్యలు వంటివి పరిష్కరించుకోవాలి. ఈ ఒప్పందం భారత్ ఆర్థిక శక్తిసామర్థ్యాలు, లౌక్యానికి చిహ్నంగా ఉంటుంది. ట్రంప్‌నకు పట్టు విడుపులతో ఇతర దేశాలతో ఆటలాడటం సరదా కావచ్చు.. కానీ మనకు జీవన్మరణ సమస్యగా మారుతుందని చూడాలి.

# కన్నడరాని ఆటోవాలాలకు కష్టాలు

## వారు ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని ప్రకటనలు

**బెంగలూరు,సెప్టెంబర్11(సమయజ్యోతి)**

ఇటీవల తెలంగాణలో మార్వాడీ గో బ్యాక్ అన్న నినాదాలు వినిపించాయి. బంద్‌లు జరిగాయి. తమ కిరాణా వ్యాపారాలకు వారు అడ్డు వస్తున్నారన్నకారణంగా స్థానిక వ్యాపారులు వ్యతిరేకతను చాటారు. అయితే పరిస్థితి సద్దుమణిగింది. కర్ణాటక ప్రజలకు తమ భాషతో పాటు- తమ సంస్కృతిపై ఉన్న ఎనలేని అభిమానం గురించి మనకు తెలిసిందే. దీనికి తోడు చాలా కాలం నుంచి స్థానిక ప్రజలకు ఉపాధి అనే మరో అంశం కూడా వారి మదిలో అలాగే నాటుకుపోయింది. పెద్ద ఉద్యోగం అయినా లేక చిన్న రోజువారీ పని అయినా తమ నేలపై తమ వారికే దక్కాలనే ఆలోచన చాలా మంది కన్నడిగుల్లో ఉంది. ఈ క్రమంలోనే తాజాగా బెంగళూరులో కొత్త నినాదం ఊపిరి పోసుకుంది. కన్నడ మాట్లాడని ఆటోవాలాలు అంటే వేరే ప్రాంతం నుంచి వచ్చి ఉపాధి పొందుతున్న వారిని టార్గెట్ చేస్తూ ఆటోల వెనుక స్టిక్కర్లు వెలియటంపై దుమారం కొనసాగుతోంది. అనధికారికంగా ఆటోలు నడుపుతున్న హిందీవాలాస్ గో బ్యాక్ అంటూ అందులో ఉంది. పర్మిట్లు-, పోలీస్ వెరిఫికేషన్, డిస్ ప్లే, బ్యాడ్జి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు కూడా ఆటోలు నడుపుతున్నారంటూ అందులో ఉంది. బెంగళూరులోని కేఆర్ పురమ్, మహదేవ్‌పురా ప్రాంతాల్లో దాదాపు ఇలాంటి ఆటోల సంఖ్య 10 వేలకు పైనే ఉన్నాయని స్టిక్కర్లో ఉంది. సోషల్ మీడియాలో ఇది తెగ వైరల్ అవుతుండటంతో చాలా మంది తమ అభిప్రాయాన్ని పంచుకుంటున్నారు. ఇలాంటి స్టిక్కర్లు చూడటం బాధగా ఉందని, మరీ ఇంత విద్వేషం పరికిరా దంటూ నమ్మబెంగళూరు అనే అకౌంట్లో పోస్టుపై క్యాప్షన్ పెట్టబడింది. కొందరు యూజర్లు ఉపాధి కోసం వచ్చిన వ్యక్తులు స్థానిక బాషతో పాటు- కల్చర్ నేర్చుకుంటే సరిపోతుందని దీనికోసం ఇలా పోస్టర్లు వేసి మరీ రచ్చ చేయటం సరికాదని అంటున్నారు. మరో వ్యక్తి మాట్లాడుతూ అందరూ సొంత కార్లలో ప్రయాణం వల్ల ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయని, బెంగళూరులో ప్రజలు విచక్ష కోల్పోయి ప్రవర్తిస్తు న్నారన్నారు. జంతువులు కూడా మనుషుల కంటే మంచిగా కలిసి జీవిస్తున్నాయని రాసుకొచ్చారు. మరొకరు ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలతో బెంగళూరు ప్రస్తుతం వివాదాలకు అడ్డాగా మారిందటూ పోస్ట్ చేశారు. మరొకరు బెంగళూరు ప్రత్యేక దేశంగా కొందరు ఫీలవు తున్నారని.. ఇతర ప్రాంతాల ప్రజలపై ఇలా విషం కక్కటం సరికాదంటూ పోస్ట్ పెట్టారు. బెంగళూరులో ఆటో డ్రైవర్లు మీటర్లు లేకుండా నడపటం అక్రమం కాదా అంటూ మరొకరు ప్రశ్నించారు. మొత్తంగా ప్రాంతీయవాదం వివిధ రకాల్లో పొచివుంది. దీనిని గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది.

# 13న ప్రధాని మోడీ మణిపూర్ పర్యటన

## -అక్కడి ప్రజల్లో సర్వత్రా ఆసక్తి-ఎలాంటి హామీలు ఇస్తారన్న ఉత్కంఠ




**న్యూఢిల్లీ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న కల్లోలిత మణిపూర్‌ను సందర్శించనున్నారు. విదేశాలకు వెళుతున్న మోడీ మణిపూర్ మాత్రం వెళ్లడం లేదని విపక్షాలు విమర్శలు చేస్తున్న వేళ ఆయన మణిపూర్ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్కడి ప్రజలతో మాట్లాడి వారికి స్వాంతన కలిగించే అవకాశం ఉంది. బ్రిటిష్ వలసపాలకులు మణిపూర్‌ను కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాలుగా విభజించి ఆ రెండిటిని వేర్వేరు పరిపాలనా వ్యవస్థల కింద ఉంచారు. ఈ వేర్పాటు- కొండ ప్రాంతాలలో అధికంగా ఉండే కుకీజోలు, మైదాన ప్రాంతాలలో సంపూర్ణ ప్రాబల్యమున్న మెయితీల మధ్య వైమనస్యతను సృష్టించింది. అది క్రమంగా తీవ్రతను సంతరించుకుని ఇప్పటికీ వైషమ్యాలను రగుల్కొలు పుతోంది. కొండ ప్రాంతాలలో ఉండే కుకీజోలు, ఇంకా నాగాలు మొదలైన తెగలవారు రాష్ట్ర జనాభాలో 47 శాతంగా ఉన్నారు. అయితే వీరి అధీనంలో విస్తారమైన భూములు ఉన్నాయి. మైదాన ప్రాంతాలలో ఉండే మెయితీలు రాష్ట్ర జనాభాలో 53 శాతంగా ఉన్నారు వీరికి భూ వసతి తక్కువే అయినప్పటికీ మొదటి నుంచీ రాజకీయ అధికారం చెలాయిస్తున్న సామాజిక వర్గమిది. భూమి హక్కులతో పాటు- రాజకీయ అధికారంలో అసమ ప్రాతినిధ్యం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో ఆ ఘర్షణలు విషమించాయి. రాష్ట్ర రాజకీయాలపై పెత్తనం చెలాయిస్తున్న మెయితీలు తమకు షెడ్యూల్డు తెగ హోదా సాధించుకునేందుకు పూనుకున్నారు. తద్వారా కొండ ప్రాంతాలలోని భూములను తమ ఆర్థిక బలంతో కైవసం చేసుకోవచ్చనేది వారి ఆలోచన. మణిపూర్ హైకోర్టు 2023 ఏప్రిల్ 14న మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలని ఆనాడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వానికి సూచించింది. మెయితీలకు ఎస్టీ హోదా లభిస్తే కొండ ప్రాంతాల భూములు సమస్తమూ వారి అధీనమవుతాయని తమకు మనుగడే కష్టమవుతుందని కుకీలు ఆందోళనకు గురయ్యారు. తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు కుకీజోలు పోరాటపథం పట్టారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్తిగా మెయితీ పక్షపాతం వహించారు. కుకీజోల అలజడిని నిర్లక్ష్యం చేశారు. పైగా వారిని నార్కో టెర్రరిస్టులు అని నిందించారు. దీంతో కుకీజోలు మే 3న ఒక బృహత్ నిరసన ప్రదర్శనకు ఉద్యుక్తులయ్యారు. మెయితీలు ప్రతిదాడులకు పూనుకున్నారు. హింస ప్రజ్వరిల్లింది. అది దావానలంలా రాష్ట్రమంతటా వ్యాపించింది. వందల మంది బలయ్యారు. వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రెండేళు దాటినా ఆ హింసాగ్నులు ఇంకా పూర్తిగా ఆరనేలేదు. మెయితీలు, కుకీజోలను దహించివేస్తున్న పరస్పర విద్వేషాగ్నులు మణిపురి సమాజాన్ని సైనికీకరణ చేశాయి. సంక్షోభానికి కారకుడైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చివరకు పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయిన తరువాత రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలో తేల్చుకోలేకపోయిన మోదీ సర్కార్ రాష్ట్రపతి పాలనను విధించింది. అయినా పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి. మెయితీలతో తమ సహజీవనం అసాధ్యమని, తమ ప్రాంతాలకు శాసన నిర్మాణ అధికారాలతో కేంద్ర పాలిత ప్రాంత హోదా నివ్వాలని కుకీజోలు డిమాండ్ చేస్తున్నారు. మెయితీలు, కుకీజోల మధ్య హింసాత్మక ఘర్షణలను నివారించేందుకు ఇరువర్గాల ప్రాంతాల మధ్య తటస్థ మండలాల నేర్పాటు- చేసి వాటిని కేంద్ర భద్రతా బలగాల కాపలాలో ఉంచారు. దీనివల్ల మణిపూర్‌లో ప్రజల, సరుకుల రవాణా నిర్నిరోధంగా సాగడం అసాధ్యమైపోయింది. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడాలంటే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించాలి. ఇది జరగాలంటే బీజేపీతో సహా అన్ని రాజకీయ పక్షాలు విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. ఇలా అతలాకుతలమైన ఈశాన్య భారత రాష్ట్రం శాతి సాధించాలి. ప్రధాని మోదీ పర్యటనతో మార్పు వస్తుందా అన్నది చూడాలి. అక్కడి ప్రజలకు ఎలాంటి హామీలు ఇస్తారన్నది కూడా ముఖ్యం. అన్నింటికి మించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాల్సి ఉంది.

# లిక్కర్ స్కామ్‌లో జగన్ 3వేల కోట్ల దోపిడీ

## -మద్యనిషేధం పేరుతో 30వేల మహిళల తాళ్లు తెంచారు-కాకాణి అక్రమాలు, భూ దందాలు బయట పెడతా

## -విలేకర్ల సమావేశంలో సోమిరెడ్డి హెచ్చరిక

**నెల్లూరు,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో జగన్ అండ్ కో రూ.3 వేల కోట్లు- దోచుకున్నారని మాజీమంత్రి, సర్వేపల్లి టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. వైసీపీ హయాంలో మద్య నిషేధం అని చెప్పి 30వేల మంది మహిళల తాళ్లు తెంచిన ఘనత వైసీపీ దేనని ఆక్షేపించారు. గురువారం నెల్లూరులో సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి టీడీపీని, తనను తిట్టందే తిన్నది అరగదని... తిన్నది అరగక ఆపరేషన్ చేయించుకున్నది కాకణినేనని ఎద్దేవా చేశారు. కాకాణి, రామిరెడ్డిపై ఎనిమిది కేసులు ఉన్నాయని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక అర్హత కాకాణికి లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు సంక్షేమం, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభను ప్రజలు విజయ వంతం చేశారని చెప్పుకొచ్చారు. నెల్లూరులో సాగరమాల నేషనల్ హైవే రోడ్డు పనులు అద్భుతంగా జరుగు తున్నాయని వివరించారు. ఏఎంఆర్, మేకపాటి కుటుంబ సభ్యులు నిజాయితీగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గ్రావెల్, ఇసుకకు వారు డబ్బులు కట్టి తోలుకుంటు-న్నారని స్పష్టం చేశారు. ఆ నిర్మాణ పనులను వైసీపీకి చెందిన వ్యక్తులే చేస్తున్నారని క్లారిటీ- ఇచ్చారు. కాకాణికి సిగ్గు, శరం లేదని విమర్శించారు. త్వరలో కాకణి చేసిన భూ దోపిడీని ఆధారాలతో సహా బయట పెడుతానని హెచ్చరించారు కాకాణివి అన్ని నిరాధార ఆరోపణలే. ఆయన చేసిన అవినీతి, అన్యాయాల నుంచి తప్పించుకోలేడు. కాకాణికి అవినీతి, అక్రమాలు, దోపిడీలు చేసిన దాంట్లో పీహెచ్‌డీ చేసిన అనుభవం ఉంది. 204 రోజులు తప్పించుకొని తిరిగి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తిని జగన్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడుగా చేశాడు. కాకణికి దోపిడీలో పీహెచ్‌డీ క్రింద డాక్టరేట్



ఇవ్వాలి. పుచ్చలపల్లి, నల్లపురెడ్డి, నేదురుమల్లి, బెజవాడ లాంటి వాళ్లు ఏలిన నెల్లూరు జిల్లాలో.. కాకాణి లాంటి వారిని జిల్లాలో చూడాల్సి వస్తోంది. మేము అధికారంలోకి వస్తే అని కాకాణి బెదిరిస్తున్నాడు.. మేము భయపడం. కోర్టు ఆర్డర్‌ను కాకణి లెక్క చెయడం లేదని.. ఆయన బెయిలును రద్దు చేయాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# నేపాల్ నుంచి విశాఖ చేరుకున్న ప్రత్యేక విమానం

## -విమానాశ్రయంలో స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు-రెండురోజులుగా వారిని రప్పించే ఏర్పాట్లలో లోకేశ్

## -మంత్రుల పనితీరును అభినందించిన సిఎం చంద్రబాబు

**విశాఖపట్టణం/అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ వాసులు నేపాల్ నుంచి విశాఖ చేరుకున్నారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు-చేసిన ప్రత్యేక విమానంలో 145 మంది ఖాట్మండ్ విమానాశ్రయం నుంచి విశాఖ చేరుకున్నారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన వారు 105 మంది కాగా, ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన 40 మంది ఉన్నారు. అనంతరం ప్రత్యేక విమానం విశాఖ నుంచి రేణిగుంట బయల్దేరింది. కూటమి ప్రభుత్వం ఏపీ వాసులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు- చేసింది. ప్రత్యేక బస్సులు, కార్లలో గమ్యస్థానాలకు చేర్చనున్నారు. విశాఖ విమానాశ్రయంలో ఏపీ వాసులకు.. ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, అతిథి గజపతిరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, కోళ్ల లలిత కుమారి, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పలువురు అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి లోకేశ్ పర్యవేక్షించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి సహచర మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేష్‌తో కలిసి అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు తగిన ఏర్పాట్లు- చేయాలని లోకేశ్ ఆదేశించారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు-చేసిన ప్రత్యేక విమానం ఇప్పటికే కాఠ్‌మాండూ చేరుకుంది. ఆ విమానంలో అక్కడ చిక్కుకున్న వారు బయలుదేరారు. కూటమి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా విమానాశ్రయాలకు వెళ్లి రాష్ట్ర వాసులకు స్వాగతం పలకాలని మంత్రి లోకేశ్ సూచించారు. విశాఖ, తిరుపతి చేరుకున్న యాత్రికులను వారి స్వస్థలాలకు చేర్చే బాధ్యతను కూటమి ఎమ్మెల్యేలకు అప్పగించారు. వాహనాలు, ఇతర సదుపాయాలను సమకూర్చాలని మంత్రి ఆదేశించారు. ఇకపోతే నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను రక్షించే పని విజయవంతంగా పూర్తయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వారిని.. వారి కుటుంబాలతో క్షేమంగా కలిపారని తెలిసి సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నారా లోకేశ్ నేతృత్వంలో మంత్రులు అనిత, దుర్గేష్‌లతో కూడిన బృందం ఆర్టీజీఎస్ కేంద్రంగా ఏపీ భవన్‌ను సమన్వయం చేస్తూ చేసిన కృషిని అభినందించారు. మన ప్రజలు సురక్షితంగా తిరిగి వచ్చేలా చూడటంలో వారి అవిశ్రాంత ప్రయత్నాలు, సత్వర స్పందన ప్రశంసనీయమన్నారు.

# యూరియా పంపిణీపై వైకాపా అసత్య ప్రచారం

## -మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు-వైకాపాకు కాలం చెల్లిందన్న మంత్రులు

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

యూరియా పంపిణీపై వైకాపా నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. కావాలనే అసత్యాలు ప్రచారం చేస్తూ రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా పంపిణీలో అవినీతి జరిగిందని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. రూ.250 కోట్ల అవినీతి జరిగిందని అసత్యాలు చెబుతున్నారు. రూ.300 బస్తాను.. రూ.500కు విక్రయిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా బస్తాపై అదనంగా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. గుడిపల్లెలో యూరియా పంపిణీలో సమస్య ఉందని రాశారు. గుడిపల్లెకు వెళ్దాం.. రైతులనే అడుగుదాం. ప్రస్తుతం ఎక్కడా యూరియా పంపిణీలో సమస్య లేదని అచ్చెన్నాయుడు వివరించారు. ఇదిలావుంటే 'సూపర్ 6.. సూపర్ హిట్' సభకు ప్రజలు పెద్దఎత్తున మద్దతు పలికారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అనంతపురం సభతో వైకాపా దుకాణం మూతపడినట్లే అని చెప్పారు. ప్రజల స్పందన చూసి జగన్‌కు అసహనం పెరిగిపోయిందని విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పినా తన సైకోయిజం మారలేదని జగన్ నిరూపించారు. ఆయన మళ్లీ అధికారంలోకి రావడం కల్లే. యూరియా కొరతపై రైతు పోరు అంటూ వైకాపా హడావిడి చేసింది. ఆ పార్టీ ఐదేళ్ల పాలనలో ఒక్క పనీ చేయలేదు.. ఎవరైనా చేసినా ఓర్వలేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోపిడీ చేయాలన్నదే జగన్ లక్ష్యం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్నదే చంద్రబాబు ధ్యేయం. ఇద్దరి నాయకుల మధ్య తేడా ప్రజలకు బాగా తెలుసని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా డకౌట్ ఖాయమని మంత్రి డీబీవీ స్వామి అన్నారు. రాష్ట్రంలో వైకాపాకు భవిష్యత్ లేదని జగన్‌కు అర్థమైందన్నారు. బుధవారం జగన్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన అసహనం బయటపడిందని చెప్పారు. ఎన్ని కష్టాలు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం. నవరత్నాల్లో ఒక్క రత్నమైనా జగన్ కోతల్లేకుండా అమలు చేశారా?ఆయనకు క్విడ్ ప్రోకో తప్ప పీపీపీ అంటే కనీసం అర్థం తెలుసా?మెడికల్ కాలేజీ టెండర్లలో పాల్గొనవద్దని బెదిరిస్తారా?ప్రజల కోసమే పీపీపీ మోడ్‌లో మెడికల్



కాలేజీల నిర్మాణం జరుగుతాయి. జగన్ వైఖరి నచ్చకే ప్రజలు వైకాపాను పాతాళంలోకి నెట్టారని డీబీవీ స్వామి అన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

# రంగరాయ కాలేజీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

**కాకినాడ,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ జిల్లా కమిటీ- ఆధ్వర్యంలో భానుగుడి, రంగరాయ మెడికల్ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శ్రీకాంత్, ఎం.గంగా సూరిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటకరణ చేయడం కోసం తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను తీసుకుని వస్తే నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి, నేడు అధికారంలోకి వచ్చాక 100 శాతం సీట్లను 10 కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వ కాలేజీల్ని ప్రైవేటు-పరం చేయడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు తమ కలల కన్న వైద్య విద్యను చదివేటు-వంటి పరిస్థితి కనుమరుగవుతుందని విమర్శించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యను ప్రైవేటు-విద్యాసంస్థల్లో చదవాలంటే లక్షలకొద్దీ డబ్బులుని కట్టాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో గత ప్రభుత్వ విధానాల వల్లే ఈ సంవత్సరం ప్రభుత్వ కాలేజీలో సెల్ఫ్ ఫైనాన్స్ గ్రూపులో కాలేజీల్లో సీట్లు- వచ్చిన విద్యార్థులు సుమారు 13 లక్షల 20 వేల రూపాయలు సంవత్సరానికి ఫీజు కట్టాల్సిన పరిస్థితి వస్తుందని, అదే ప్రభుత్వ కాలేజీ ప్రభుత్వం ఆధీనంలో ఉంటే కేవలం సుమారు 15 వేల రూపాయలతో సంవత్సరానికి వైద్య విద్యను అభ్యసించవచ్చని, ఇటు-వంటి ప్రభుత్వ వైద్య కళాశాలను నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీ-కరణ చేయడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించి,పేద ప్రజానీకానికి ఉచితంగా వైద్యం అందించాలని అనుకుని వచ్చేటు-వంటి విద్యార్థులకు ప్రభుత్వం విధానాల వల్ల వారి ఆశయాలు, వారి కలలు అడియాసలవుతున్నాయని విమర్శించారు. పేద ప్రజలకు భవిష్యత్తులో వైద్య విద్య అందకుండా ఉండేటు-వంటి పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య కాలేజీల్ని ప్రైవేటు-పరం చేయడం కాకుండా మరిన్ని ప్రభుత్వ వైద్య కాలేజీలను ఏర్పాటు- చేయడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కాలేజీల్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భరోసాను కల్పించాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రభుత్వ వైద్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

# ఏపీ లిక్కర్ స్కాంలోసిట్ ముమ్మర దర్యాప్తు

## జగన్ సన్నిహితుడైన నర్రెడ్డి సునీల్ రెడ్డి కంపెనీల్లో సోదాలు

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఏపీ లిక్కర్ స్కాంలోసిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సన్నిహితుడైన నర్రెడ్డి సునీల్ రెడ్డి కంపెనీల్లో సిట్ అధికారులు సోదాలు చేపట్టారు. సునీల్ రెడ్డికి చెందిన పది కంపెనీల్లో సోదాలు జరుగుతున్నాయి. పది కంపెనీలకు గానూ ఐదు కార్యాలయాల్లో సిట్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నంల్లోని ఐదు కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-3 -స్నేహా హౌస్, బంజారాహిల్స్ - రోడ్ నెంబర్ - 2-సాగర్ సొసైటీ-, కాటేదాన్ - రాజేందర్ నగర్, ఖైరతాబాద్ - కమలాపురి కాలనీ - ఫేజ్ వన్‌లో ఉన్న కార్యాలయాల్లో సోదాలు చేస్తున్నారు. వాల్తేర్ రోడ్ - వెస్ట్ వింగ్ - విశాఖపట్నంలో ఉన్న మరో కార్యాలయంలో సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ - విశాఖపట్నంల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు సిట్ అధికారులు హైదరాబాద్‌లోని 8 కంపెనీలకు గానూ 4 కార్యాలయాలు, విశాఖపట్నంలోని రెండు కంపెనీల్లో ఒక కార్యాలయం ఏర్పాటు- చేసుకున్నారు సునీల్ రెడ్డి. ఆర్ ఆర్ గ్లోబల్ ఎంటర్ ప్రైజెస్, గ్రీన్ స్మార్ట్ ఇన్‌ఫ్రా కాన్, గ్రీన్ -టె-క్ ఇంజనీరింగ్ సిస్టమ్స్, శేఖర్ ఫౌండేషన్, గ్రీన్ -టె-ల్ ఎంటర్ ప్రైజెస్, గ్రీన్ కార్ట్ మీడియా, వయోలేటా ఫర్నిచర్స్, గ్రీన్ స్మార్ట్, జెన్సీస్ పెట్రో కెమికల్స్ అండ్ లాజిస్టిక్స్, గ్రీన్ ఫ్యూయల్స్ గ్లోబల్ ట్రెండింగ్ కంపెనీలు నిర్వహిస్తున్నారు సునీల్ రెడ్డి. ప్రైవేట్ లిమి-టె-డ్, రర, ఫౌండేషన్ హోదాల్లో సునీల్ రెడ్డి కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సునీల్ రెడ్డి కంపెనీల్లో సిట్ అధికారులు సోదాలు చేస్తుండటంతో కీలక ఆధారాలు లభ్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# మంత్రి లోకేశ్ చొరవ నేపాల్ నుంచి ప్రత్యేక విమానం

**అమరావతి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ వాసులు నేపాల్‌లోని కాఠ్మాండూ విమానాశ్రయం నుంచి రాష్ట్రానికి బయల్దేరారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు- చేసిన ప్రత్యేక విమానంలో 144 మంది పయనమయ్యారు. కాఠ్‌మాండూ నుంచి ప్రత్యేక విమానం మొదటగా విశాఖపట్నం విమానాశ్రయానికి, ఆ తర్వాత తిరుపతి విమానాశ్రయానికి చేరుకోనుంది. విశాఖకు 104 మంది, తిరుపతికి 40 మంది రానున్నారు. కూటమి ప్రభుత్వం ఏపీ వాసులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు- చేసింది.విశాఖ, తిరుపతి విమానాశ్రయాల్లో తెలుగువారికి స్వాగతం పలికేందుకు కూటమి ఎమ్మెల్యేలు, అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఆయా విమానాశ్రయాల నుంచి వారి స్వస్థలాలకు చేర్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు- చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడంపై రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి లోకేశ్ పర్యవేక్షించారు.

# చైనా సరిహద్దుల్లో చిక్కుకున్న తెలుగువారు

## మానస్ సరోవర్ యాత్రకు వెళ్లి ఇక్కట్లు

**విశాఖపట్నం,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

మానస సరోవరం యాత్రకు వెళ్లి 21 మంది తెలుగు ప్రజలు చైనా సరిహద్దులో చిక్కుకున్నారు. మానస సరోవరం యాత్ర ముగించుకున్న తర్వాత నేపాల్ మీదుగా భారత్‌లోకి రావాల్సి ఉంది. అయితే, నేపాల్ అల్లర్ల దృష్ట్యా టూర్ ఆపరేట్ యాత్రీకులను చైనా సరిహద్దులోనే నిలిపివేశారు. దీంతో సొంతూళ్లకు చేర్చాలని వేడుకుంటూ వీడియో సందేశం పంపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని కోరుతున్నారు. చైనా సరిహద్దులో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాత్రకు ఏపీ నుంచి 21 మంది వెళ్లగా వారిలో 8 మంది విశాఖ వాసులు కాగా, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌కు చెందిన 13 మంది ఉన్నట్టు- సమాచారం.

# రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద లొంగిపోయిన మిథున్

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు కోసం తాత్కాలిక బెయిల్

**రాజమండ్రి,సెప్టెంబర్11(సమయజ్యోతి):**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ అయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓట- హక్కు వినియోగించుకునేందుకు విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఆరు రోజుల మధ్యంతర బెయిల్ గడువు పూర్తి కావడంతో సెంటర్ జైల్లో సరెండర్ అయ్యారు మిథున్ రెడ్డి.. ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం రాజమండ్రి సెంట్రల్ జైల్లోకి వెళ్లి సరెండర్ అయ్యారు..సంచలనంగా మారిన ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన ఎంపీ మిథున్ రెడ్డి.. ఇప్పటికే 47 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఇక, ఏసీబీ ఇచ్చిన రిమాండ్ గడువు కూడా శుక్రవారంతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో రేపు విజయవాడలోని ఏసీబీ కోర్టులో మిథున్‌రెడ్డిని హాజరుపర్చనున్నారు పోలీసులు.. దీని కోసం ఉదయం ఏడు గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ ఎస్కార్ట్ తో రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు తీసుకెళ్లనున్నారు పోలీసులు.. కాగా, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు తెలిపింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. అయితే సెప్టెంబర్ 9న జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసుందుకు బెయిల్ ఇవ్వాలంటూ ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా.. ఏసీబీ కోర్టు ఐదు రోజులు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# హార్దిక్ పాండ్యాతో పోల్చడాన్ని ఖండించిన శివమ్ దూబే



ల్‌రౌండర్ శివమ్ దూబే తాను హార్దిక్ పాండ్యాతో తనను పోల్చుకోవడం సరికాదని చెప్పాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్ తనకు అన్నయ్య లాంటివాడని, అతడి నుంచి నిరంతరం నేర్చుకుంటున్నానని తెలిపాడు. బుధవారం, సెప్టెంబర్ 10న దుబాయ్‌లో యూఏఈకి వ్యతిరేకంగా జరిగిన ఆసియా కప్ 2025 గ్రూప్ ఎ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్ తర్వాత దూబే మీడియాతో మాట్లాడాడు. చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ కేవలం నాలుగు పరుగులకు మూడు వికెట్లు తీశాడు. దీంతో భారత జట్టు కేవలం 13.1 ఓవర్లలో యూఏఈని 57 పరుగులకే ఆలౌట్ చేసింది. భారత జట్టు ఇద్దరు మీడియం-పేస్ ఆల్‌రౌండర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉంచింది. జస్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. మిగిలిన బౌలింగ్‌కు శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా ఉన్నారు. శివమ్ దూబే కేవలం రెండు ఓవర్లలో మూడు వికెట్లు తీసి తన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. దూబే మాట్లాడుతూ, "హార్దిక్ నుండి నేను నేర్చుకుంటూ ఉంటాను. అతను నాకు అన్నయ్య లాంటివాడు. ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో అతని అనుభవం చాలా ఎక్కువ. అతని నుండి నేను ఎంత నేర్చుకోగలిగితే అంత నేర్చుకోవాలని అనుకుంటున్నాను. నేను ఎప్పుడూ నన్ను అతనితో పోల్చుకోవాలనుకోలేదు" అని చెప్పాడు. దూబే, హార్దిక్ ఇద్దరూ పేస్-బౌలింగ్ ఆల్‌రౌండర్లు. అయితే, భారత జట్టు వారిని వేర్వేరు పాత్రల కోసం ఉపయోగిస్తోంది. ఇద్దరూ 2024లో టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో ఉన్నారు. హార్దిక్ టీమిండియా లిమిటెడ్ ఓవర్ల ఫార్మాట్‌లో ఒక ముఖ్య ఆటగాడిగా స్థిరపడ్డాడు. కానీ, దూబే ఇంకా తనకి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాడు. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దూబే ఏడు మ్యాచ్‌లలో బౌలింగ్ చేసి ఎనిమిది వికెట్లు తీశాడు. గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ ఇచ్చిన ప్రోత్సాహం గురించి గుర్తు చేసుకుంటూ దూబే.. "కెప్టెన్, కోచ్ నాకు బౌలింగ్ చేస్తానని ముందే చెప్పారు. మాకు నీపై నమ్మకం ఉందని వారు అన్నారు. నా బౌలింగ్ కోచ్ నాకు చాలా విషయాల్లో సహాయం చేశారు. అవకాశం వచ్చినప్పుడు బౌలింగ్ చేసేందుకు నేను రెడీ అవుతున్నాను. ఈ రోజు నా ప్రదర్శన దాని రిజల్ట్" అని అన్నాడు. మోర్కెల్‌తో తన సంభాషణల గురించి దూబే చెబుతూ.. "ఇంగ్లాండ్ సిరీస్‌లో, అతను నాకు కొన్ని ముఖ్యమైన చిట్కాలను అందించాడు. అతను క్రీజ్‌ను ఉపయోగించుకుని, స్టంప్స్‌కు దూరంగా బౌలింగ్ చేయమని చెప్పాడు. అతను నా స్లో బంతులను మెరుగుపరుచుకోవడానికి సలహా ఇచ్చాడు. నేను చాలా కాలం నుండి దానిపై వర్క్ చేస్తున్నాను. అతను నా రన్-అప్‌ను కూడా అడ్జస్ట్ చేయడానికి సహాయం చేశాడు. ఈ మార్పుల వల్ల నేను బాగా బౌలింగ్ చేయగలుగుతున్నాను." అంటూ చెప్పుకొచ్చాడు. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ తెలివిగా దూబేకు బౌలింగ్ అవకాశం ఇచ్చాడు. ఇది రాబోయే కఠినమైన మ్యాచ్‌లకు సిద్ధం కావడానికి భారత్‌కు సహాయపడింది. దూబే ప్రదర్శన జట్టు మేనేజ్‌మెంట్‌కు బౌలింగ్ కాంబినేషన్‌లో మరింత సౌలభ్యం ఇచ్చింది. ఆదివారం (సెప్టెంబర్ 14)న భారత జట్టు తన దాయాది పాకిస్తాన్‌తో దుబాయ్‌లో తలపడనుంది. ఈ హై-ఓక్టేన్ మ్యాచ్‌లో కూడా దూబే తన ఫామ్‌ను కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు.



## మహిళల వన్డే ప్రపంచకప్ 2025కు అంపైర్లంతా మగువలే!

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసీసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. తొలిసారి మహిళలతో కూడిన పూర్తి స్థాయి అంపైర్ ప్యానెల్, మ్యాచ్ అఫిషియన్స్ జాబితాను ప్రకటించింది. సెప్టెంబర్ 30 నుంచి భారత్, శ్రీలంక వేదికగా జరిగే ఈ టోర్నీలో షాండర్ ఫ్రిట్జ్, ట్రూడీ ఆండర్సన్, జి.ఎస్. లక్ష్మి, మిచెల్ పెరీరా మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరించనున్నారు.ఎంతో అనుభవం కలిగిన క్లైర్ పోలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, స్యూ రెడ్‌ఫెర్న్‌లు 14 మంది సభ్యులతో కూడిన అంపైర్స్ ప్యానెల్‌లో ఉన్నారు. గత రెండు ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లు, 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో పూర్తిగా మహిళా అధికారులు బాధ్యతలు చేపట్టినప్పటికి 13 ఏళ్ల మహిళల వన్డే ప్రపంచకప్ చరిత్రలో మాత్రం ఇదే తొలిసారి. ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఐసీసీ ఛైర్మన్ జై షా ప్రశంసించాడు. ఈ నిర్ణయం మహిళల క్రికెట్‌ను మరింత ప్రోత్సహిస్తుందని, మరింత మంది మహిళలు ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకుంటారని చెప్పారు. 'మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఓ సంచన నిర్ణయం. ఇది మహిళల క్రికెట్ మరింత అభివృద్ధి చెందేలా చేస్తుంది. పూర్తిగా మహిళా మ్యాచ్ అధికారుల ప్యానెల్‌ను ప్రకటించడం ఓ రికార్డ్ మాత్రమే కాదు. క్రికెట్‌లో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఐసీసీ చేస్తున్న కృషికి ప్రతిబింబం ఇది.'అని జై షా తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే 8 జట్లు బరిలోకి దిగుతుండగా.. ఆతిథ్య దేశాలైన భారత్, శ్రీలంక మధ్య సెప్టెంబర్ 30న గౌహతి వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీకి తెరలేవనుంది. అంపైర్లు: లారెన్ ఏజెన్‌బాగ్, కాండస్ లా బోర్డే, కిమ్ కాటన్, సారా దంబనేవానా, షాతిరా జాకిర్ జెసీ, కెర్రిన్ క్లాస్టే, జననీ ఎన్, నిమలి పెరీరా, క్లైర్ పోలోసాక్, బ్రిందా రాఠీ, స్యూ రెడ్‌ఫెర్న్, ఎలోయిస్ షెరిడాన్, గాయత్రి వేణుగోపాలన్, జాక్వెలిన్ విలియమ్స్

# ప్రాక్టీస్ సెషన్‌కు సల్మాన్ అలీ అఘా దూరం

## భారత్‌తో మ్యాచ్.. పాకిస్థాన్‌కు బిగ్ షాక్



ఆసియా కప్ 2025 సీజన్‌లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ సల్మాన్ అలీ అఘా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగిన పాకిస్థాన్ ప్రాక్టీస్ సెషన్‌కు సల్మాన్ అలీ అఘా దూరంగా ఉన్నాడు. అతను మెడ నొప్పితో బాధపడుతున్నట్లు పాకిస్థాన్ మీడియా పేర్కొంది. జట్టుతో కలిసి దుబాయ్‌లోని ఐసీసీ క్రికెట్ అకాడమీకి వచ్చినప్పటికీ.. మెడకు బ్యాండేజ్ వేసుకొని కనిపించాడు. దాంతో అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు మొదలయ్యాయి.ప్రాక్టీస్ సెషన్‌కు సల్మాన్ అలీ అఘా దూరంగా ఉన్నాడని, అతని సహచరులు మాత్రం వార్మప్, స్ట్రెచింగ్ డ్రిల్స్‌తో పాటు ఫుట్‌బాల్ ఆడారని పాకిస్థాన్‌కు చెందిన ఓ ఛానెల్ పేర్కొంది. సల్మాన్ అలీ అఘా అసౌకర్యంగా కనిపించాడని, ముందస్తు చర్యల్లో భాగంగానే ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడని తెలిపింది. అయితే సల్మాన్ అలీ అఘాకు ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేవని, అతని మెడ నొప్పి చిన్నదేనని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) మీడియా మేనేజర్ వివరణ ఇచ్చారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగానే అతను విశ్రాంతి తీసుకున్నాడని, శుక్రవారం ఒమన్‌తో జరిగే మ్యాచ్‌లో అతను బరిలోకి దిగుతాడని తెలిపాడు. ఆసియా కప్‌లోని అన్ని మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉంటాడని స్పష్టం చేశాడు.ఆసియా కప్ 2025 టోర్నీకి సన్నాహకంగా జరిగిన ట్రై సిరీస్‌లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో అఫ్గాన్‌ను 75 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈ సిరీస్‌లో యూఏఈ కూడా ఆడగా.. మహమ్మద్ నవాజ్ హ్యాట్రిక్ వికెట్‌తో సంచలన విజయాన్నందించాడు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో ఉన్న పాకిస్థాన్.. సెప్టెంబర్ 14న తమ చిరకాల ప్రత్యర్థి భారత్‌తో తలపడనుంది. ఈ హై-ఓల్టేజ్ మ్యాచ్ కోసం యావత్ క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. యూఏఈ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉండటం పాకిస్థాన్‌కు కలిసిరానుంది. ప్రస్తుతం పాక్ స్పిన్నర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ఈ క్రమంలోనే భారత్, పాక్ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

# ఇండియా, పాక్ మ్యాచ్ కు అమ్ముడు పోని టికెట్లు





ఏ క్రీడలో అయినా కానీ, ఇండియా, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే ఆ లెవలే వేరు. ఇక క్రికెట్ విషయానికొస్తే ఈ రెండు జట్ల మధ్య పోరు గురించి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఎదురు చూస్తుంటారు. గత పదేళ్లుగా ఇరు దేశాల మధ్య బైలేటరల్ సిరీస్ లేకపోవడంతో ఐసీసీ లేదా ఏసీసీ నిర్వహించే టోర్నీల్లో మాత్రమే ఇరుజట్లు పాల్గొంటున్నాయి. అయినప్పటికీ, టికెట్లు మాత్రం హాట్ కేకుల్లాగా అమ్ముడు పోతున్నాయి. అయితే ఫర్ ద ఫస్ట్ టైమ్.. దుబాయ్ లో జరుగుతున్న ఆసియా కప్ లో మాత్రం సీన్ రివర్స్ అయినట్లు తెలుస్తోంది. మ్యాచ్ కు ఇంకా నాలుగు రోజుల మాత్రమే సమయం ఉన్నప్పటికీ, ఇప్పటికీ చాలా టికెట్లు అమ్ముడు పోలేదని తెలుస్తోంది. తాజా పరిణామం క్రికెట్ ప్రపంచాన్ని ఉలిక్కి పడేలా చేసింది. అయితే దీనికి గల కారణాలున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అధిక టికెట్ ధరలు, కాంబో ఆఫర్లతోనే దాయాదుల మధ్య పోరుకు అభిమానుల నుంచి స్పందన అంతంతమాత్రం ఉందని తెలుస్తోంది. టికెటింగ్ సైట్లన గమనించినట్లయితే వీఐపీ సూట్ టికెట్ (ఇద్దరికి) ధరలను ఏకంగా రూ.2.5 లక్షలుగా కోట్ చేశారు. అయితే ఈ టికెట్ తోపాటు సౌకర్యవంతమైన సీటింగ్, అన్లిమిటెడ్ ఫుడ్, పార్కింగ్ పాస్, వీఐపీ క్లబ్/ లాంజ్ యాక్సెస్, ప్రైవేట్ ఎంట్రన్స్, సెపరేట్ రెస్ట్ రూమ్ తదితర సౌకర్యాలను కాంబో రూపంలో అందించారు. అయితే టికెట్ రేట్ ను భారీ గా పెట్టడంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. వీఐపీ గ్యాలరీతోపాటు మిగతా కేటగిరీల టికెట్ల ధరలు కూడా భారీగా ఉన్నాయి. ఇక రాయల్ బాక్స్ టికెట్ల ఖరీదు (ఇద్దరికీ) రూ. 2.3 లక్షలు, స్కై బాక్స్ టికెట్ల ధర రూ.1.6 లక్షలుగా నిర్ణయించారు. ఇక ప్లాటినం లెవల్ టికెట్ల ధరలను భారీగా అంటే రూ.75వేలకుపైగా నిర్ణయించారు. ఇక కనీస ధరను రూ.10 వేలుగా నిర్ణయించడంతో క్రికెట్ ప్రేమికుల కళ్లు తిరుగుతున్నాయి. దీంతోనే ఆ క్రేజీ మ్యాచ్ కు ఆదరణ కాస్త తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా దాయాదుల మధ్య పోరును ఎన్ క్యాష్ చేసుకుందామని భావించిన నిర్వాహకులకు తాజా పరిణామం గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లుగా మారిందని విమర్శకులు చురకలు అంటిస్తున్నారు. ఇక ఆసియాకప్ లో భారత్ గ్రాండ్ గా ఎంట్రీ ఇచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య యూఏఈని 57 పరుగులకే పరిమితం చేసి, తమపై లోయెస్ట్ స్కోరు చేసిన చెత్త రికార్డును ఆ జట్టుకు టీమిండియా బహుకరించింది. అలాగే టార్గెట్ ను 4.3 ఓవర్లలో 60/1 తో ఛేజ్ చేసి, సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఏకంగా 93 బంతులు మిగిలి ఉండగానే టీమిండియా ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం విశేషం. నాలుగు వికెట్లతో సత్తా చాటిన భారత్ కు చెందిన చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కడం విశేషం.

# యూఏఈపై భారత్ భారీ విజయం



ఆసియా కప్ ను తనదైన స్టైల్లో ఇండియా ప్రారంభించింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్.. బుధవారం దుబాయ్ లో జరిగిన మ్యాచ్ లో పసికూన, ఆతిథ్య యూఏఈపై 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూఏఈ భారత బౌలర్ల ధాటికి బెంబేలెత్తిపోయింది. కేవలం 13.1 ఓవర్లలోనే 57 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ అలీషన్ షరాపు (17 బంతుల్లో 22, 3 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కరర్ గా నిలిచాడు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ((4/7) బంతితో మాయ చేసి అద్భుతం చేశాడు. అనంతరం ఛేజింగ్ ను కేవలం 4.3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 60 పరుగులు చేసి కంప్లీట్ చేసిన భారత్, 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (16 బంతుల్లో 30, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. అభిషేక్ వికెట్ ను జునైద్ సిద్దిఖీ తీశాడు. ఈ ఫలితంలో టోర్నీలో ఇండియా బోణీ కొట్టడంతోపాటు గ్రూప్-ఏలో తొలి విజయాన్ని సాధించింది. తర్వాత మ్యాచ్ లో భాగంగా ఈనెల చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ తో ఆదివారం (14న) తలపడనుంది.

# సూర్యకుమార్ యాదవ్ పై నెటిజన్లు ప్రశంసలు

ఆసియా కప్ 2025లో భాగంగా యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముఖ్యంగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిర్ణయాలు, ఆటతీరుపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. శభాష్ సూరీడు%౯౨% మాట నిలబెట్టుకున్నావ్ అంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ కొడియాడుతున్నారు. ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అని చెప్పవచ్చు. ఎందుకంటే గత ఏడాది టీమిండియా తరపున అద్భుత ప్రదర్శన చేసినా, శుభ్‌మన్ గిల్ తిరిగి వైస్ కెప్టెన్‌గా జట్టులో చేరడంతో సంజూ స్థానంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. గిల్ గైర్హాజరీలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ, పది ఇన్నింగ్స్‌లలో మూడు శతకాలతో తన సత్తా చాటాడు. కానీ గిల్ రాకతో సంజూ ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కుతుందా లేదా అన్న ప్రశ్న అభిమానులను కలవరపెట్టింది. మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే లాంటి సీనియర్ ఆటగాళ్లు ఉండగా, ఫినిషర్‌గా జితేష్ శర్మకు మంచి అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావించారు. ముఖ్యంగా ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ విజయంలో జితేష్ కీలక పాత్ర పోషించడం అతనికి అదనపు బలం ఇచ్చింది. దీంతో సంజూ మరోసారి బెంచ్‌కే పరిమితమవుతాడా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.అయితే మీడియా అడిగిన ప్రశ్నకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టమైన సమాధానం ఇచ్చాడు. సంజూ శాంసన్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అతనికి తగిన ప్రాధాన్యం ఇస్తామని తెలిపాడు. అలాగే తుది జట్టు ఎంపికలో న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని హింట్ ఇచ్చాడు. చెప్పినట్టుగానే, యూఏఈతో తొలి మ్యాచ్‌లో సంజూని ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవడం ద్వారా సూర్య తన మాట నిలబెట్టుకున్నాడు.దీంతో నెటిజన్లు సూర్యను సోషల్ మీడియాలో ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కెప్టెన్ కూల్, సంజూపై నమ్మకం చూపిన నిజమైన నాయకుడు అంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే మరోవైపు కొందరు అభిమానులు, శుభ్‌మన్ గిల్ కోసం సంజూకు అన్యాయం చేయకూడదని సూచిస్తున్నారు. సంజూను ఓపెనర్‌గా కొనసాగిస్తేనే అతని ఆటతీరు మరింత మెరుగుపడుతుందని భావిస్తున్నారు.





# ఐశ్వర్య ఫోటోలు వాడ డానికి లేదు

## వాడితే కఠిన చర్యలు తప్పవన్న కోర్టు

ఇకపై ఐశ్వర్య అనుమతి లేకుండా ఆమె ఫొటోలు వాడడానికి వీల్లేదని న్యాయస్థానం ఆదేశించింది. ఐశ్వర్య ఫొటోలు దుర్వినియోగం చేయడం వల్ల ఆమెకు ఆర్థికంగా నష్టం కలిగించడమే కాకుండా ఆమె గౌరవం, ప్రతిష్ఠ ను దెబ్బతీసినట్లేనని కోర్టు పేర్కొంది. ఈమేరకు ఆమె ప్రచార, వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా విడితే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ హైకోర్టు హెచ్చరించింది. అనుమతి లేకుండా తన ఫొటోలు వాడుతున్నారంటూ ఇటీవల నటి ఐశ్వర్యారాయ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ కేసులో గురువారం న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఐశ్వర్య పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అందులో గుర్తించిన యూఆర్‌ఎల్‌లను తొలగించి బ్లాక్ చేయాలని ఇ-కామర్స్ వైబ్‌సైట్‌లను, గూగుల్ సహా ఇతర ఎ÷-లాట్‌ఫార్మ్‌లను దిల్లీ హైకోర్టు ఆదేశించింది. నోటీ-సులు అందిన 72 గంటల్లోపు పిటిషన్‌లో ఐశ్వర్య పేర్కొన్న యూఆర్‌ఎల్ బ్లాక్ చేయాలని పేర్కొంది. ఆ యూఆర్‌ఎల్స్‌ను ఏడు రోజుల్లో బ్లాక్ చేసేలా ఆదేశాలివ్వాలని కేంద్ర ఐటీ-, సమాచార శాఖకు కోర్టు సూచించింది. ఈ కేసులో తదుపరి విచారణ జనవరి 15న జరగనుంది. ఇక ఇదే విషయంపై ఐశ్వర్య భర్త, నటు-డు అభిషేక్ బచ్చన్ కూడా దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.



## సిద్ధూ జొన్నల గడ్డ.. తెలుసుకదా టీజర్ విడుదల

యువ హీరో సిద్దు జొన్నల గడ్డ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తెలుసు కదా. ఈ సినిమాకు పాపులర్ స్క్రీన్ రైటర్ కోన వెంకట్ సోదరి నీరజ కోన దర్శకత్వం వహిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అక్టోబర్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను వదిలారు మేకర్స్. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి, టాలీవుడ్ బ్యూటీ- రాశి ఖన్నా కథానాయికలుగా నటించబోతున్నారు. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి యువరాజ్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు.



## రంగీలా రీ రిలీజ్‌ను ప్రకటించిన రామ్‌గోపాల్ వర్మ

బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ సినిమాలలో ఒకటైన 'రంగీలా' సినిమాను రీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించాడు ఆ చిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఈ సినిమా విడుదలై సెప్టెంబర్ 8 నాటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ 'అల్ట్రా మీడియా' ఈ సినిమాను త్వరలోనే 4కే వెర్షన్‌లో రీ రిలీజ్ చేయబోతుందని వర్మ సోషల్ మీడియా వేదికగా తెలిపాడు. రంగీలా' సినిమా 1995లో విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో ఆమిర్ ఖాన్, ఊర్మిళ మాతోండ్కర్, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమాతోనే ఏ.ఆర్. రెహమాన్ బాలీవుడ్‌కి సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రానికి ఆయన అందించిన పాటలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. అయితే ఈ సినిమా మళ్లీ థియేటర్లలో ఎప్పుడు విడుదలవుతుందనేది ఇంకా స్పష్టంగా తెలియదు, కానీ అక్టోబరులో రీ-రిలీజ్ అయ్యే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది.




# నువ్వు యాక్షన్ హీరో అవుతావ్

## కార్తికేయన్‌కు తలైవా ప్రశంసలు



శివకార్తికేయన్‌పై అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి ఆదరణ సొంతం చేసుకుంటోంది. తాజాగా ఈ సినిమా చూసిన రజనీ చిత్రబృందాన్ని అభినందించారు. ఈ విషయాన్ని తెలుపుతూ శివకార్తికేయన్ పోస్ట్ పెట్టారు. తాను దైవంగా భావించే తలైవా నుంచి ప్రశంసలు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సినిమా బాగుంది. నీ నటన మరో స్థాయిలో ఉంది. అద్భుతంగా నటించావు. మదరాసి నాకు చాలా నచ్చింది. నువ్వు యాక్షన్ హీరో అయిపోతావు. నా దీవెనలు నీకు ఎప్పుడూ ఉంటాయి' అంటూ తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుతో రజనీకాంత్ నన్ను ప్రశంసించారు. నా దైవం నుంచి అభినందనలు అందుకోవడం ఆనందంగా ఉందని శివకార్తికేయన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక ఈ సినిమా విడుదలైన అనంతరం కోలీవుడ్ సినీ ప్రముఖులు దీన్ని ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. దర్శకుడు శంకర్, లింగుస్వామి 'మదరాసి'పై రివ్యూ ఇచ్చారు.మదరాసి కథేంటంటే...తమిళనాడులో తుపాకీ సంస్కృతిని అలవాటు- చేసి సొమ్ము చేసుకోవాలనేది ఒక సిండికేట్ పన్నాగం. విరాట్ (విద్యుత్ జమ్వాల్), చిరాగ్ (షబీర్ కల్లరక్కల్) అనే ఇద్దరు స్నేహితుల్ని రంగంలోకి దించి ట్రక్కులకొద్దీ ఆయుధాల్ని తరలిస్తుంది. అవన్నీ ఓ ఫ్యాక్టరీకి చేరుతుండగా ఎన్.ఐ.ఎ.కి తెలుస్తుంది. ప్రేమ్‌నాథ్ (బిజు మేనన్) నేతృత్వంలోని ఎన్.ఐ.ఎ. ఆపాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదు. దాంతో ఆయుధాలు నిల్వ ఉంచిన ఫ్యాక్టరీ మొత్తాన్ని పేల్చివేయాలనే ఒక ఆపరేషన్‌కి నడుం బిగిస్తుంది ఎన్.ఐ.ఎ. అయితే ఈ ఆపరేషన్ అంత సులభమైనదేమీ కాదు. ఒకరి ప్రాణాల్ని పణంగా పెట్టాల్సిందే. సరిగ్గా అదే సమయంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న రఘురామ్ (శివకార్తికేయన్)ను ప్రేమ్‌నాథ్ కలుస్తాడు. ప్రాణాల్ని ఏమాత్రం లెక్కచేయని రఘురామ్‌ని ఈ ఆపరేషన్‌లోకి తీసుకురావాలని నిర్ణయిస్తాడు. మరి ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందా? అసలు రఘురామ్ ఎవరు? అతనికి ప్రాణాలంటే లెక్కలేనితనం ఎందుకు? మాలతి (రుక్మిణీ వసంత్)తో అతనికి ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరకెక్కించారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్న సయారా



బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న సైయారా చిత్రం ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ- వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం సెప్టెంబర్ 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు- ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు. ఆషికీ 2, ఎక్ విలన్ వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత మోహిత్ సూరి దర్శకత్వంలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే జూలై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆ అంచనాలను అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. మొదటిరోజు నుంచే భారీ కలెక్షన్లు రాబడుతున్న ఈ చిత్రం ఇటీవల రూ.581 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టినట్లు- చిత్రబృందం యష్‌రాజ్ ఫిలిమ్స్ ప్రకటించింది. ఈ సందర్భంగా సరికొత్త రికార్డును అందుకుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చి అత్యధిక కలెక్లన్లు సాధించిన చిత్రంగా ఈ సినిమా నిలిచింది. కేవలం ఇండియాలోనే రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించగా.. వరల్డ్ వైడ్‌గా రూ.169 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ రానుడటంతో ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685